PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 127 | విజయవాడ, సోమవారం 9 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 9 December 2024 | Rs

'కొవ్వాడ'కు

కోనాడ ఉప్పు భూములు ?

- పావులు కదుపుతున్న కేంద్రం

3

11వ రౌండ్‌లో గుకేశ్ గెలుపు

- ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

సింగపూర్: ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వరుస డ్రాల పర్వానికి తెరపడింది. వరుసగా ఏడు గేమ్‌ల డ్రా తర్వాత ఆదివారం జరిగిన 11వ రౌండ్ గేమ్‌లో భారత యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్.. డిఫెండింగ్ ఛాంపియన్, చైనాకు చెందిన డింగ్ లిరెన్‌పై విజయం సాధించాడు. ఇది కేవలం 29ఎత్తుల్లోనే ముగిసింది. తెల్లపావులతో గుకేశ్ బరిలోకి దిగి ఎన్ఎఫ్-3తో గేమ్‌ను ప్రారంభించగా.. నల్లపావులతో ఆడిన డింగ్.. డి-5తో గేమ్‌ను ప్రారంభించాడు. మరో మూడు రౌండ్‌ల ఆట మాత్రమే మిగిలి ఉండగా.. ఈ విజయంతో గుకేశ్ 6 పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు.

సంజీవ్ భట్ నిర్దోషి

కస్టడీ వేధింపుల కేసులో గుజరాత్ కోర్టు తీర్పు

పోరుబందర్ : 1997 కస్టడీ వేధింపుల కేసులో మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్‌ను గుజరాత్‌లోని పోరుబందర్‌లో కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో సంజీవ్ భట్‌పై అభియోగాలను 'సందేహం లేకుండా నిరూపించలేకపోయారు' అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముఖేష్ పాండ్యా శనివారం తీర్పు ఇచ్చారు. తీర్పు పూర్తి పాఠం ఆదివారం అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వోద్యోగిగా నిధులు నిర్వర్తిస్తున్న నిందితుడ్ని ప్రాసిక్యూట్ చేయడానికి అవసరమైన అనుమతి కూడా తీసుకోలేదని కోర్టు పేర్కొంది.

పోరుబందర్ ఎస్‌పిగా సంజీవ్ భట్ పనిచేస్తున్న సమయంలో ఆయుధాల చట్టం, టాడా కింద నమోదైన కేసులో నేరాన్ని అంగీకరించాలని శారీరకంగా, మానసికంగా తనను హింసించారని భట్, కానిస్టేబుల్ విజుభాయి చౌపై నారన్ జాదవ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. 1994 ఆయుధాల ల్యాండింగ్ కేసులో 22 మంది నిందితుల్లో జాదవ్ ఒకరు. ముందుగా 1997, జులై 6న పోరుబందర్ మేజిస్ట్రేట్ కోర్టును నారన్ జాదవ్ ఆశ్రయించారు. తనను పోలీసుల బృందం చిత్ర హింసలు పెట్టిందని, ప్రైవేట్ పార్ట్స్‌తో పాటు శరీరంలోని వివిధ భాగాలకు విద్యుత్ షాక్ పెట్టారని జాదవ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జాదవ్ ఫిర్యాదును స్వీకరించిన కోర్టు 1998, డిసెంబరు 31న భట్, చౌలకు సమన్లు జారీ చేసింది. ఈ కోర్టు ఆదేశాలతో 2013, ఏప్రిల్ 15న పోరుబందర్ సిటీ బి-డివిజన్ పోలీస్‌స్టేషన్‌లో భట్, చౌ (మరణానంతరం)పై ఎఫ్ఐఆర్ నమోదయింది. ఐపిసి సెక్షన్లు 330, 324 కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి ఆరోపణలను నిరూపించలేకపోయారని కోర్టు భట్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కాగా, సంజీవ్ భట్ ప్రస్తుతం రాజ్‌కోట్ సెంట్రల్ జైల్లో రెండు కేసులకు సంబంధించిన శిక్ష అనుభవిస్తున్నారు. 1990 జామ్‌నగర్‌లో కస్టడీ మృతి కేసులో జీవిత ఖైదు, 1996లో రాజస్థాన్‌కు చెందిన లాయర్‌ను డ్రగ్స్ కేసులో ఇరికించిన కేసులో భట్ శిక్ష అనుభవిస్తున్నారు. అలాగే 2002 గుజరాత్ అల్లర్ల కేసులో కృత్రిమ సాక్ష్యాధారాలు సృష్టించారన్న కేసులో భట్ ఒక నిందితుడిగా ఉన్నారు.

2002 గుజరాత్ అల్లర్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ పాత్ర కూడా ఉందని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేయడం ద్వారా సంజీవ్ భట్ అందరి దృష్టిని ఆకర్షించారు. అప్పటి నుంచి కేంద్రం, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు ఆయనపై కత్తిగట్టాయి. చిత్రహింసలకు గురి చేశాయి. విధులకు 'అనధికార గైర్హాజరు' అయ్యారన్న వంకతో సంజీవ్ భట్‌ను గుజరాత్ ప్రభుత్వం పోలీస్ సర్వీస్ నుంచి తొలగించింది. దీనికి వ్యతిరేకంగా భట్ వేసిన పిటీషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

సిట్ అంటే.. ఇక అంతే!

- కంటి తుడుపు, కాలయాపన, పక్కదారి • గత అనుభవం ఇదే • బియ్యం స్మగ్లింగ్‌పైనా అదే ఎత్తుగడ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కాకినాడ పోర్టు కేంద్రంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు మొత్తం వ్యవహారం నీరుగార్చే చర్యగా కనిపిస్తోంది. గతంలో ప్రభుత్వాలు వేసిన సిట్‌లు ఏ విధంగా కేసులను తాత్సారం చేశాయో బియ్యం స్మగ్లింగ్‌పైనా అదే దారి పడుతుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సిట్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లోనే కాలయాపన ఉద్దేశం బయట పడింది. సిట్ విచారణకు నిర్ణీత గడువు విధించకుండా, ప్రతి పదిహేను రోజులకు పురోగతిపై నివేదిక ఇవ్వమన్నారు. దీన్నిబట్టి విచారణ ఇప్పుడప్పుడే తెమిలేది కాదని అర్థమవుతోంది. మరోవైపు సిట్ అధిపతి సిఐడి ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ మాట్లాడుతూ తాము ఇప్పటికిప్పుడు హడావుడి పడాల్సిందేమీ లేదంటూ.. ప్రభుత్వం తమకు నిర్దేశించిన విధి విధానాల మేరకు అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరపాలంటే సమయం పడుతుందని వెల్లడించారు. ఈ అంశాలన్నీ బియ్యం స్మగ్లింగ్ కేసులను సాధ్యమైనంత వరకు సా..గదీసేందుకేనన్న ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

డైవర్షన్ కోసం

సిట్, సిఐడి... ఏదైనా అప్పటికి వేడి తగ్గించేందుకు వేసే ఎత్తుగడని ఇప్పటికే పలు సందర్భాల్లో రుజువైంది. ప్రభుత్వంలో ఉన్న వారు ప్రత్యర్థులపై వ్యక్తిగత, రాజకీయ కక్షలు తీర్చుకునేందుకు, కేసుల కాలయాపన కోసం అనే అభిప్రాయం రాష్ట్రంలో కొన్నేళ్లలో స్థిరపడిపోయింది.

కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలతో సీజ్ చేసిన స్టెల్లా ఎల్, పనామా నౌక ఇదే (ఫైల్)

విశాఖ భూముల కుంభకోణంపై టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలు వేసిన సిట్‌లు ఆ కోవలోకే వస్తాయి. అమరావతి రాజధానిలో భూముల ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై వేసిన సిట్ కూడా అటువంటిదే. ఇలా చెప్పుకుంటూ పోతే సిఐడి విచారణలు, సిట్ దర్యాప్తులు ఎలాంటి ముగింపు లేకుండా పోయాయి. ప్రస్తుత బియ్యం స్మగ్లింగ్ తంతు కూడా అలాగే అనిపిస్తోంది. నవంబర్ 29న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీ చేసి పిడిఎస్ బియ్యం స్మగ్లింగ్ అవుతున్నాయని ప్రకటించగా, తదుపరి టిడిపి, జనసేన, వైసిపి మధ్య రాజకీయ విమర్శలు తీవ్ర స్థాయిలో నడిచాయి. కానీ బియ్యం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం నిర్దిష్ట చర్య తీసుకోలేదని, ఆయా పార్టీల నేతలు రాజీ పడ్డారన్న ఆరోపణలు రావడం వల్లనే వారం దాటాక ఎట్టకేలకు సర్కారు సిట్ వేసిందన్న చర్చ జరుగుతోంది.

అందుకే అనుమానం

పోర్టుల్లో ఎగుమతులు, దిగుమతులపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) వంటి విభాగాల నిఘా ఉంటుంది. అక్రమ బియ్యం ఉన్నాయంటున్న స్టెల్లా నౌక సీజ్‌పై కస్టమ్స్ అధికారి ఏం చెబుతున్నారంటే... నౌకలో పలువురు ఎగుమతిదారుల పలు రకాల సరుకులుంటాయి. ఒక ఎక్స్‌పోర్టర్‌కు చెందిన అక్రమ బియ్యం ఉందని మొత్తం నౌకను సీజ్ చేయలేం. బియ్యం శాంపిల్స్ ల్యాబ్‌కు పంపాలి. పరీక్షల్లో పిడిఎస్ బియ్యం అని తేలితే ఆ సరుకును మాత్రమే సీజ్ చేయాల్సి ఉంటుంది. పరీక్షల ఫలితాలు రావడానికి కొన్ని వారాలు పడుతుంది.. అన్నారు. ఆయన ఇంకొక బాంబు పేల్చారు. ఎన్నికలకు ముందు విశాఖపట్నం పోర్టులో డ్రగ్స్ కంటైనర్ పట్టుబడిందని ప్రచారం జరగ్గా, సిబిఐ చేసిన పరీక్షల్లో అది మాదక ద్రవ్యం కాదని రిపోర్టు వచ్చిందని, అందుకే ఆ సరుకును విడుదల చేశామన్నారు. దొరికింది డ్రగ్స్‌గా డిఆర్ఐ, నార్కో, కస్టమ్స్ అప్పట్లో నానా హడావుడి చేశాయి. చివరికి డ్రగ్స్ కాదని తేల్చారు. నిజంగానే డ్రగ్స్ కాదా? లేకపోతే కేంద్రంలోని మోడీ సర్కారు తిమ్మినిబమ్మిని చేసిందో తెలీదు. ఈ పూర్వరంగంలో బియ్యం స్మగ్లింగ్ కథ కూడా అంతేనన్న సందేహాలొస్తున్నాయి. ఇప్పటికే బియ్యం స్మగ్లింగ్ వ్యవస్థీకృతమైందని, కొందరు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, మిల్లర్లు, ఎక్స్‌పోర్టర్లు... ఇలా అక్టోపస్ మాదిరి మాఫియా కార్యకలాపాలు విస్తరించాయని ప్రభుత్వమే చెబుతోంది. టిడిపి, జనసేన, వైసిపి నాయకులకు ప్రత్యక్ష పరోక్ష సంబంధాలున్నాయని ఆరోపణలొస్తున్నాయి. ఆయా పార్టీల్లోని ముఖ్య నాయకుల మధ్య ఆధిపత్య, కమీషన్ల, లాలూచీ వ్యవహారాలు నడుస్తున్నాయని చర్చ జరుగుతోంది. ఒకరి ప్రయోజనాలను మరొకరు దెబ్బతీయడం, పై చేయి సాధించడం, కేసుల నుంచి బయట పడటం.. ఈ లక్ష్యంగా పని చేస్తున్నారని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో సిట్ విచారణతో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే !

ధాన్యం తడవకుండా చర్యలు

- కలెక్టర్లకు సిఎం ఆదేశం

2

చాగంటి నియామకం సబబు కాదు

- ముఖ్యమంత్రికి 30 మంది ప్రముఖుల బహిరంగ లేఖ

3

సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి

గొప్ప ప్రజాకళాకారుడు

- గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభలో వక్తల నివాళి

2

పింఛన్ల ఏరివేత ?

- నేడు, రేపు సామాజిక పింఛన్ల తనిఖీలు
- 13 అంశాలతో ప్రశ్నావళి
- జిల్లాకు ఒక సచివాలయం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పింఛన్లు తీసుకునే లబ్ధిదారుల సంఖ్యను కుదించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెల 9, 10 తేదీల్లో తనిఖీలు చేపడుతోంది. పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక సచివాలయాన్ని ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టులో వచ్చే ఫీడ్ బ్యాక్‌ను బట్టి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో త్వరలో ఇదే విధమైన తనిఖీలు చేపట్టనున్నారు. భోగస్, అనర్హుల పింఛన్ల విషయంపై వికలాంగులు, ఇతర కేటగిరీల్లో అనర్హులు పింఛన్ పొందుతున్నట్లు ప్రభుత్వానికి కొన్ని ఫిర్యాదులు అందాయి. వాటిని సాకుగా చెప్పి పింఛన్ల వెరిఫికేషన్‌కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పింఛన్ల తనిఖీలకు సంబంధించి షెడ్యూల్, విధి విధానాలను సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు జి వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలివిడతగా చేపట్టనున్న పింఛన్ల తనిఖీ కార్యక్రమాన్ని ఈ నెల 9న ఒక్కరోజే పూర్తి చేసి, 10న సాయంత్రం 5 గంటలకల్లా ప్రభుత్వానికి అధికారులు, సచివాలయ ఉద్యోగులు నివేదిక ఇవ్వాలి. తనిఖీల్లో సచివాలయ సిబ్బందిని కాకుండా పక్క మండలానికి చెందిన సిబ్బందిని నియమించింది. ఒక్కో సర్వే బృందం 40 మంది పింఛనుదారులను ప్రత్యక్షంగా కలిసి యాప్‌లో వివరాలు సేకరించనుంది.

13 అంశాలతో ప్రశ్నావళి

సామాజిక పింఛన్ల తనిఖీకి వెళ్ళిన బృందానికి ప్రభుత్వం 13 ప్రశ్నలు సూచించింది. ప్రశ్నల వివరాల్లోకి వెళితే.. పింఛనుదారుని స్టేటస్‌ను యాప్‌లో నివాసం ఉంటున్నారా? మరణించారా? అందుబాటులో లేరు అనే కాలమ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.12 వేలు ఆపైన ఉందా? లబ్ధిదారుని కుటుంబానికి మూడెకరాలు కంటే ఎక్కువ మాగాణి, పదెకరాల కంటే ఎక్కువ మెట్ట లేదా రెండూ కలిపి పదెకరాల కంటే ఎక్కువ భూమి ఉందా? కుటుంబంలో ఎవరైనా నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్నారా? (ట్యాక్సీ, ట్రాక్టర్లు, ఆటో మినహాయింపు) అవును, లేదు అనే కాలమ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అదే విధంగా కుటుంబంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లేదా ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగి లేదా పెన్షనర్ ఎవరైనా ఉన్నారా? కుటుంబ సరాసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే ఎక్కువ ఉందా? మున్సిపల్ ప్రాంతాల్లో కుటుంబానికి 1000 చదరపు అడుగులు కంటే ఎక్కువ నిర్మాణ ప్రాంతం ఉందా? కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా? కుటుంబంలో ఎవరైనా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారా? పింఛన్‌దారు వికలాంగత్వం కలిగి ఉన్నారా? పింఛన్‌దారుని రీ అసెస్‌మెంట్‌కు (వైద్య పరీక్షలకు) సిఫార్సు చేస్తున్నారా? ఆయా ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసిన అనంతరం పింఛను కొనసాగించడానికి సిఫార్సు చేస్తున్నారా లేదా అనే వివరాలు తనిఖీ చేసే ఉద్యోగి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం పింఛన్‌దారుని ఫొటో క్యాప్చర్ చేయాల్సి ఉంటుందని ఉద్యోగులకు ప్రభుత్వం సూచించింది.

తిరుగుబాటుదార్ల సంబరాలు.. ఇన్‌సెట్‌లో సిరియా అధ్యక్షుడు అసద్

సిరియాలో తిరుగుబాటు

- దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు
- అధికారం మాదేనన్న తిరుగుబాటుదారులు
- తాజా పరిణామంపై మిశ్రమ స్పందన

డమాస్కస్: సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పదవీచ్యుతులయ్యారు. అమెరికా మద్దతు కలిగిన సిరియన్ ఫ్రీ ఆర్మీ' దళాల తిరుగుబాటు దారులు ఆదివారం ఉదయం రాజధాని డమాస్కస్ ను ఆక్రమించుకోవడంతో సిరియా వారి వశమైంది. అధ్యక్షుడు అసద్ దేశం విడిచి విమానంలో అజ్ఞాత ప్రదేశానికి వెళ్లిపోయారని సీనియర్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. దీంతో 24 ఏళ్ల అసద్ పాలనకు తెరపడిందని ఆర్మీ కమాండ్ అధికారులు చెప్పారు. హయత్ తెహ్రీర్ అల్-షామ్ (హెచ్‌టిఎస్), ఫ్రీ సిరియన్ ఆర్మీ (ఎఫ్ఎస్ఎ), ఇతర మిగతా 5లో

చెట్టును ఢీకొన్న కారు

- భార్య, భర్త సహా నలుగురు దుర్మరణం
- మొక్కులు తీర్చుకొని వస్తుండగా ఘటన
- పల్నాడు జిల్లా ప్రమాదంలో నెల్లూరు జిల్లా వాసుల మృతి

ప్రమాదానికి గురైన కారు

ప్రజాశక్తి- పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

దైవ దర్శనానికి వెళ్లి మొక్కులు తీర్చుకొని వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. వారిలో భార్య, భర్త కూడా ఉన్నారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు, గాయపడిన వారు నెల్లూరు జిల్లాకు చెందిన వారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రహ్మణపల్లి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు జిల్లా కావలి మండలం సిరిపురానికి చెందిన ఎనిమిది మంది తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు, యాదగిరిగుట్టలో మొక్కులు తీర్చుకుని తిరిగి సొంతూరుకు కారులో వెళ్తున్నారు. బ్రహ్మణపల్లి సమీపంలోని గీతికా సిబిఎస్ఇ పాఠశాల వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టును కారు బలంగా ఢీకొట్టింది. దీంతో, కారులోని తుళ్లూరి సురేష్ (35), తుళ్లూరి వనిత (32), ముప్పాళ్ల యేబులు (60), తిరుపతయ్య (50) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో సురేష్, వనిత భార్యాభర్తలు. కారును నడుపుతున్న కారు ఓనర్ ముప్పాళ్ల ప్రణయ్‌కుమార్, ముప్పాళ్ల ఆదిలక్ష్మి, ముప్పాళ్ల శ్రీను, కౌసల్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలిని పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు, సిఐ వెంకట్రావు పరిశీలించారు. ఎస్‌పి మాట్లాడుతూ త్వరగా వెళ్లాలనే ఉద్దేశంతో అతివేగంగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. దూర ప్రయాణం చేసేటప్పుడు ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నేడు టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల కౌంటింగ్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. కాకినాడలోని జెఎన్‌టియుకె ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. 16,737 మంది ఓటర్లకుగానూ 15,502 (92.62 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆధ్వర్యంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం తొమ్మిది రౌండ్లలో లెక్కింపు జరగనుంది. ఇందుకోసం 140 మంది సిబ్బందిని కేటాయించారు. ఓట్ల లెక్కింపునకు ఏడు గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటి రౌండ్ ఫలితం మధ్యాహ్నం రెండు గంటలకు వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి బొర్ర గోపిమూర్తి, రిటైర్డ్ అధ్యాపకులు గంధం నారాయణరావు మధ్య ప్రధానంగా పోటీ ఉంది.

మరో సర్దుపోటు

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న డిస్కమ్‌లు
- తాజా ఎఫ్‌పిపిసిని కూటమి ప్రభుత్వం రద్దు చేయదా?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై ప్రతి నెల, ప్రతి ఏటా సర్దుబాటు చార్జీలు వేస్తున్నారు. ఇప్పటికే నాలుగు భారాలు మోపిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఐదో భారాన్ని కూడా మోపాలని చూస్తున్నాయి. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) ఛార్జీలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కమ్‌ల) వసూలు చేస్తున్నాయి. ఈ భారాలు చాలవని, ఇంకా వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సమర్పించేందుకు సిద్ధమవుతున్నాయి. కొత్త చార్జీలు మోపబోమని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నా తాను అధికారంలోకి వచ్చిన తరువాత కాలానికి సంబంధించిన ఎఫ్‌పిపిసిఎ చార్జీలను రద్దు

చేసి వినియోగదారులకు భారాల నుంచి కొంత ఉపశమనం కలిగించే దిశగా ఎలాంటి ఆలోచన చేయడం లేదు.

కొత్త భారాలు మోపాలంటే ఎపిఇఆర్‌సి నుంచి డిస్కమ్‌లు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ఎఫ్‌పిపిసిఎ పేరుతో ఇఆర్‌సి అనుమతి లేకుండానే యూనిట్‌కు 40పైసలు వరకు వినియోగదారులపై భారం మోపేందుకు కేంద్రప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అంత కన్నా ఎక్కువ ఉంటే దాన్ని ఆర్థిక సంవత్సరం ముగిశాక వేయొచ్చని చెప్పింది. ఈ ఆదేశాల మిగతా 5లో

2024-25 సంవత్సరంలో డిస్కమ్‌లు లెక్కకట్టిన ఎఫ్‌పిపిసిఎ భారం

నెల	సిపిడిసిఎల్	ఎస్‌పిడిసిఎల్	ఈపిడిసిఎల్
ఏప్రిల్	0.5435	0.5053	0.435
మే	0.7491	0.4394	0.6381
జూన్	0.8193	0.6255	0.8099
జులై	0.6528	0.5357	0.6742
ఆగస్టు	0.5086	0.6198	0.4468
సెప్టెంబర్	0.6874	0.6502	0.6878
అక్టోబర్	0.4325	0.4756	-

ట్రెజరీ ఆదేశాలను ఉపసంహరించుకోవాలి

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెన్షనరు బతికి ఉన్నప్పుడు విడాకులు పొందిన ఆడపిల్లలకు మాత్రమే ఫ్యామిలీ పెన్షన్ పొందేందుకు అర్హులని 30.10.24న డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో పెన్షనరు/ఫ్యామిలీ పెన్షనరు చనిపోతే వారి కుటుంబంలోని వితంతు/విడాకులు పొందిన వారికి ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేసే వారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్‌ను 180 రోజులు మాత్రమే ఇస్తున్నారని, కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఇస్తున్న విధంగా 730 రోజులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకూ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదులపై స్పందించకుంటే డిజిపి కార్యాలయం వద్ద ధర్నా

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేస్తున్న టిడిపి వారిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. నారా లోకేష్ ఆధ్వర్యంలో ఐటిడిపి కార్యకర్తలు తనపై, తన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా ప్రయోజనం లేకపోయిందన్నారు. నేరం జరిగిందని ఫిర్యాదు చేస్తే కేసు కూడా నమోదు చేయడం లేదని తెలిపారు. గత నెల 17న ఫిర్యాదు చేస్తే ఇప్పటికీ చర్యలు లేవన్నారు. వైసిపి నేతలపై సంబంధం లేని వ్యక్తులు ఫిర్యాదు చేసిన వెంటనే కేసులు నమోదు చేస్తున్న పోలీసులు తాము చేస్తున్న ఫిర్యాదులపై స్పందించడం లేదన్నారు. వీటిపై త్వరలో తాము డిజిపి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- సిపికి టిడిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి ఎంపి విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని టిడిపి నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కోరారు. ఆదివారం విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాకినాడ పోర్టు అంశాన్ని తప్పుదారి పట్టించేందుకు విజయసాయి మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే చంద్రబాబును జైల్లో వేస్తామంటూ మాట్లాడటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేయాలని సిపిని కోరామని తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోకపోతే కోర్టుకు వెళతామని స్పష్టం చేశారు.

తిరుపతి, వైజాగ్‌లోనూ ఎన్‌టిఆర్ సినీ వజ్రోత్సవాలు

- ఎన్‌టిఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ జనార్ధన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నందమూరి తారక రామారావు (ఎన్‌టిఆర్) సినీ జీవితంలోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహించే వజ్రోత్సవాలు కార్యక్రమాన్ని విజయవాడతో పాటు తిరుపతి, వైజాగ్, చెన్నై, బెంగళూరులోనూ నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టిడి జనార్ధన్ వెల్లడించారు. పోరంకిలో లిటరేచర్ కమిటీ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణికం, జానపదం అన్ని రంగాల్లోనూ నటించిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని పేర్కొన్నారు. రాజకీయ రంగంలో కూడా ప్రజలకు ఎన్‌టిఆర్ చేసిన సేవ మరొకరు చేయలేదన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో కిలో బియ్యం రూ.2లకు అందించారని, మహిళలకు ఆస్తిలో వాటా అందించారని చెప్పారు. వృద్ధులకు పింఛన్ ప్రవేశపెట్టారని తెలిపారు.

ఎన్‌టిఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగంలో మకుటం లేని మహారాజుగా ఎన్‌టిఆర్ ఉన్నారని తెలిపారు. ఎన్‌టిఆర్ జీవిత విశేషాలతో కూడిన పుస్తకాలను అన్ని భాషల్లో విడుదల చేస్తామన్నారు. ఆయన చరిత్రను త్వరలో పాఠ్యపుస్తకాల్లో వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. విజయవాడలో ఈ నెల 14న జరిగే వజ్రోత్సవాల కార్యక్రమంలో సిఎం చంద్రబాబుతోపాటు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

గొప్ప ప్రజాకళాకారుడు

గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభలో వక్తల నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడన నిలిచి కళారంగంలో విశిష్ట సేవలందించిన గాదె సుబ్బారెడ్డి ఉత్తమ కమ్యూనిస్టుగా, గొప్ప ప్రజాకళాకారుడిగా నిలిచారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి కొనియాడారు. ప్రముఖ సినీ నటులు అజయ్‌ఘోష్ మాట్లాడుతూ ప్రజా కళాకారులకు మరణంలేదని అన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సిఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ముందుగా సుబ్బారెడ్డి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షతన జరిగిన సభలో పుణ్యవతి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా నెరవేర్చేవారని గుర్తు చేశారు. కవి, రచయిత అయిన సుబ్బారెడ్డి ప్రజాక్షేత్రంలో కమ్యూనిస్టుగా, కళాకారునిగా రాణించారని తెలిపారు. విజయవాడ కేంద్రంగా పని చేస్తున్న జాషువా విజ్ఞాన కేంద్రం, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలోత్సవాలు, పిల్లల్లో విజ్ఞాన సముపార్జనకు అనేక కళారూపాలను తయారు చేయడంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు.

మరణాంతరం తన దేహం కూడా ప్రజలకు ఉపయోగపడేలా వైద్య పరిశోధనకు అప్పగించాలన్న ఆయన ఆశయాన్ని కుటుంబ సభ్యులు నెరవేర్చడం అభినందనీయమన్నారు. వారి కుటుంబానికి పార్టీ యావత్తు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, విజయవాడ ఎంబివికె ఛైర్మన్ పి.మధు మాట్లాడుతూ సుబ్బారెడ్డి మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, సాంస్కృతిక, కళా రంగాలకు తీరని లోటని తెలిపారు. దేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్న నేటి తరుణంలో సుబ్బారెడ్డి లాంటి వ్యక్తుల అవసరం ఎంతో ఉందన్నారు. మరింత పట్టుదలతో మతోన్మాద వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టడమే ఆయనకు అర్పించే నిజమైన ఘన నివాళి అని అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 1980, 2000 సంవత్సరాల మధ్య కృష్ణా జిల్లా ఉయ్యూరులో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగంలో సుబ్బారెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. సినీ నటులు అజయ్‌ఘోష్ మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి డప్పు మోగినంత కాలం సుబ్బారెడ్డి లాంటి ప్రజా కళాకారులు బతికే ఉంటారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించామా లేదా అన్నదే చూడాలని, అలాంటి వారిలో సుబ్బారెడ్డి ముందు వరుసలో ఉన్నారని, తన జీవితాన్ని సార్ధకం చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వై.వెంకటేశ్వరరావు, బి తులసీదాసు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, ఎపి ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు చంద్రా నాయక్, తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకన్న, రాష్ట్ర నాయకులు పి.దేవేంద్ర, గాయకులు ఎ.జగన్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు ఎం.జగ్గరాజు, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, దోనేపూడి కాశీనాథ్, సుబ్బారెడ్డి సతీమణి శివలీల, కుమార్తెలు మేడగం శిరీష, జెట్టి ఆషాదేవి, అల్లుళ్లు మేడిగం శ్రీకాంత్‌రెడ్డి, జెట్టి శివనాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సినీ నటులు అజయ్‌ఘోష్ , టిడిపి నాయకుడు వైవిబి రాజేంద్రప్రసాద్

'ఉపాధి'కి అరకొర నిధులు

- 100 రోజుల పని కూడా లేని కుటుంబాలెన్నో..

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించే నిధులు ప్రతియేడాదీ తగ్గుతూ వస్తున్నాయి. ఫలితంగా ఈ పథకంలో వేతనదారులకు పని కల్పించలేని సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో అర్జీలు సమర్పించినా వివిధ కారణాలతో పనులు కల్పించడం లేదు. కొన్నేళ్ల కిందట బడ్జెట్‌లో కేటాయింపులు తక్కువగా చూపించినా ఖర్చు కాస్త ఎక్కువగా చేసి.. అనంతరం సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉంది. ప్రస్తుతం కేటాయింపులు తక్కువగా చూపినప్పటికీ అవికూడా ఖర్చు చేయని పరిస్థితి నెలకొంది. 2020-21 బడ్జెట్‌లో రూ.3,270 కోట్లు కేటాయిస్తే ఆ ఏడాది మాత్రమే రూ.4,526.08 కోట్లు కొంత ఎక్కువగా ఖర్చు చేసింది. 2021-22 బడ్జెట్‌లో రూ.4,307.64 కోట్లు కేటాయించగా, కేవలం రూ.2,927.61 కోట్లు ఖర్చు చేశారు. 2022-23 బడ్జెట్‌లోనూ రూ.5 వేలకోట్లు కేటాయించగా, ఖర్చు చేసిన మొత్తం రూ.3,376.90 కోట్లుగా ఉంది. 2023-24 బడ్జెట్‌లో రూ.5,115.38 కోట్లు కేటాయించగా, ఆ మొత్తాన్ని రివైజ్ చేసి కేవలం రూ.2,658.27 కోట్లకే పరిమితం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రూ.5,414.72 కోట్లు కేటాయింపులు మాత్రం చూపించగా, ఏ మేరకు ఖర్చు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

100 రోజుల పని తగ్గుముఖం

ఉపాధి పథకానికి నిధులు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించడం లేదు. వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాల వివరాల్లోకి వెళితే..

2020-21లో అత్యధికంగా 8,62,807 ఉంటే, 2021-22లో 4,68,576 కుటుంబాలు, 2022-23లో ఇవి మరింత తక్కువగా 2,59,649 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. 2023-24లో కొంత మెరుగై 6,87,385 ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇప్పటి వరకూ కేవలం 2,06,913 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని కల్పించారు. మెటీరియల్ కాంపొనెంట్ వినియోగంపైనే ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, పేదలకు ఉపాధి పనులు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు

- కలెక్టర్లకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో వర్షపాత సూచనల నేపథ్యంలో రైతులు ఇప్పటికే పంట కోసి ధాన్యాన్ని రాసులుగా పోసి ఉంటే, ఆ ధాన్యం వర్షాలకు తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆదేశాలు జారీ అయ్యాయి. ధాన్యపు రాసులను వర్షాలకు తడవకుండా సమీపంలోని రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా రైతులు కోత కోసి ధాన్యాన్ని రాసులుగా పోసి ఉంటే అవి తడవకుండా కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు సమకూర్చాలని ఆదేశించారు. వర్షాలు పడే సమయంలో రైతులెవరూ పంట కోయకుండా వ్యవసాయశాఖ చేసే సూచనలను పాటించేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

ప్రత్యామ్నాయ శక్తిగా సిపిఎం

- పల్నాడు జిల్లా మహాసభలో సిహెచ్.బాబూరావు పిలుపు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

రాష్ట్రంలో బిజెపితో కలిసి రాజకీయాలు చేస్తోన్న టిడిపి కూటమి, వైసిపికి ప్రత్యామ్నాయంగా సిపిఎంను బలోపేతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. నిత్యావసరాల ధరలు, కుటుంబ నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగి ప్రజలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మూడ్రోజులపాటు జరిగిన మహాసభ ఆదివారం రాత్రి ముగిసింది. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వ విధానాలు రాష్ట్రాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఒకదానికొకటి ఏ మాత్రమూ ప్రత్యామ్నాయం కాదని వివరించారు. కేంద్రంలో నియంత పాలన చేస్తోన్న బిజెపిని ఎదుర్కొనగలిగే శక్తి, చిత్తశుద్ధి, రాజకీయ పంథా ప్రధాన రాజకీయ పార్టీలకు లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు ఒక నూతన ప్రత్యామ్నాయ అజెండాతో ముందుకు సాగుతున్న వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల వల్లే అది సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షించే శక్తులన్నీ కలిసి ప్రజా ఉద్యమాలను పెంపొందించడం ద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని ప్రజల అజెండాగా తీసుకురావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఎన్నికల అజెండాగా కాకుండా అభివృద్ధి కోసమే ఒక ప్రత్యేక అజెండాతో ముందుకు వెళ్లేందుకు సిపిఎం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, కె.హరికిషోర్ మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. పల్నాడు ప్రాంతానికి ఎంతో ఉపయోగపడే వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని మహాసభ డిమాండ్ చేసింది. సిమెంట్ ఫ్యాక్టరీల కోసం తీసుకున్న భూముల్లో పరిశ్రమలు నిర్మించాలని లేదా ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని కోరుతూ తీర్మానించింది. దుర్గి మిర్చి యార్డులో కొనుగోలు ప్రారంభించాలని, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని, యువతకు ఉపాధి అవకాశాలను పెంచాలని, జిల్లాలోని వనరులను ఉపయోగంలో పెట్టాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, పంటలకు మద్దతు ధరలు కల్పించాలని కోరుతూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. పల్నాడు జిల్లాలో 43 శాతం భూములకు మాత్రమే సాగు నీటి వసతి ఉందని, సాగు భూమి మొత్తానికి కనీసం ఒక పంటకైనా నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేసింది.

మహా సభలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

జిల్లా కార్యదర్శిగా విజయకుమార్

సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ 18 మందితో ఏర్పాటైంది. కార్యదర్శిగా గుంటూరు విజయకుమార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు ఎన్నికయ్యారు.

ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

- స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను పోరాటాలతో అడ్డుకుంటామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒ.వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 1350వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలని, ఆ మేరకు ప్రధాని మోడీతో స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. అంతవరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ వచ్చిన తరువాతనే విశాఖ ఇంతలా అభివృద్ధి చెందిందని, వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కాయని గుర్తు చేశారు. ప్లాంట్‌కు సొంత గనులు, ఆర్థిక వనరులు సమకూరిస్తే లాభాల బాట పడుతుందన్నారు. దీక్షల్లో యూనియన్ ఉపాధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు, కార్యదర్శి నరసింగరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

'మనబడి' మాసపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా ఆధ్వర్యాన రూపొందించిన 'మనబడి' మాసపత్రికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారని సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు వెల్లడించారు. బాపట్లలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు కరదీపికలా ఉపయోగపడే ఈ పత్రికను రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు అన్నింటికీ నెలనెలా పంపుతామన్నారు. సామాజిక మాధ్యమాలు, వాట్సాప్, యాప్, వెబ్‌సైట్ ద్వారా 'మనబడి' ఈ కాపీ అందరికీ చేరుస్తామని తెలిపారు. విద్యార్థులు వేసిన బొమ్మలు, రాసిన కథలు, కవితలు, పాటలు, వినూత్న ప్రయోగాలు, ఆటలు, సాధించిన విజయాలు-బహుమతులు, విద్యార్థుల విజయ గాథలకు పత్రికలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తల వ్యాసాలు, ఆలోచనలతో ఈ పత్రికను అందంగా, ఆకర్షణీయంగా తీసుకురావడం తమ లక్ష్యమని వివరించారు. దీనికి గౌరవ సలహాదారులుగా ఉన్నతాధికారులు, ఎడిటర్‌గా తాను వ్యవహరిస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ రచనలను సమగ్రశిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అండ్ ఎడిటర్, సమగ్రశిక్షా కార్యాలయానికి పంపించాలన్నారు. ఆన్‌లైన్ మ్యాగజైన్ www.schooledu.ap.gov.in/samagrashiksha/,cse.ap.gov.in వెబ్‌సైట్లలో వీక్షించవచ్చని తెలిపారు.

'మన బడి' ప్రారంభ సంచిక ముఖచిత్రం

పేరెంట్, టీచర్స్ మీట్ కొత్తేమీ కాదు

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకంలో, వారికి ఇస్తానన్న రూ.15 వేలు ఎప్పుడు ఇస్తారనే అంశం ప్రస్తావించకుండా మెగా పేరెంట్, టీచర్స్ మీట్ అంటూ సిఎం చంద్రబాబు హడావుడి చేస్తున్నారని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు కొత్తమీ కాదని, ఈ సమావేశాలకు పేరు మార్చి కూటమి ప్రభుత్వం హడావుడి చేయడం తప్ప మరేమీ లేదంటూ 'ఎక్స్'లో ఆదివారం పోస్టు చేశారు. వైసిపి ప్రభుత్వం ఎంతో కష్టించి విద్యా రంగాన్ని తీర్చిదిద్దితే... కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేస్తూ తల్లికి వందనం అంటూ తల్లిదండ్రులకు సున్నం రాసిందన్నారు. తల్లికి వందనం పథకానికి బడ్జెట్‌లో రూ.12,450 కోట్లు కేటాయించాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. తల్లిదండ్రులపై ఈ భారం పడదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ హయాంలో విద్యార్థులకు కల్పించిన వాటన్నిటినీ కూటమి ప్రభుత్వం రద్దు చేసి వారికి అన్యాయం చేస్తోందన్నారు.

ప్రభుత్వాధికారులకు ఆమ్యామ్యాలు

- 66 శాతం వ్యాపార సంస్థలు వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌ను అవినీతి మహమ్మారి ఎన్నో ఏళ్ల నుంచి పట్టి పీడిస్తున్నది. ప్రభుత్వాలు మారినా.. ఈ జాఢ్యం మాత్రం వదలటం లేదు. ప్రభుత్వాధికారులు తమ బాధ్యతలను విస్మరించి.. ధనార్జనే ధ్యేయంగా పని చేస్తుండటంతో ఆమ్యామ్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ విభాగాలకు చెందిన పలు విభాగాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. పని అక్రమమైనా, సక్రమమైనా.. అధికారుల చేతులు తడపనిదే పని కావటం లేదు. ఇప్పుడు, దేశంలోని వ్యాపార సంస్థలూ ఇవే పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. గత పన్నెండు నెలల్లో తాము లంచాలిచ్చినట్టు దాదాపు 66 శాతం సంస్థలు చెప్పాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'లోకల్‌సర్కిల్స్' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఇందులో భాగంగా, ఈ ఏడాది మే 22 నుంచి నవంబర్ 30 మధ్య దేశంలోని 159 జిల్లాల్లో సర్వే నిర్వహించి 18వేల స్పందనలను తీసుకున్నారు.

ఈ సర్వే సమాచారం ప్రకారం.. ప్రక్రియ వేగవంతం కోసం 54 శాతం సంస్థలు బలవంతంగా, 46 శాతం సంస్థలు స్వచ్ఛందంగా లంచాలు చెల్లించాయి. అనేక వ్యాపారాలు అనామకంగా ఉన్నందున అనుమతి లేదా సమ్మతి ప్రక్రియను వేగవంతం చేయటానికి ప్రభుత్వ శాఖలను కావాలనుకున్నపుడు లంచాలు జీవన విధానంగా మిగిలిపోతాయి. అథారిటీ లైసెన్స్ పొందాలన్నా లేదా ఆస్థి విషయాలకు సంబంధించి ఏదైనా విషయంలోనైనా ఇది కనిపిస్తుంది. గత 12 నెలల్లో 66 శాతం వ్యాపారాలు ముడుపులు ముట్టజెప్పాయి. తాము ఎలాంటి లంచం చెల్లించకుండానే పని చేయించుకోగలిగామని 16 శాతం వ్యాపారసంస్థలు వెల్లడించాయి. తమకు అలా చేసే అవసరమే రాలేదని 19 శాతం వివరించాయి. అనుమతులు, సరఫరాదారు అర్హతలు, ఫైల్‌లు, ఆర్డర్‌లు, చెల్లింపులు సాధారణంగా నిలిపివేయబడిన వంటి విషయాల్లో ప్రభుత్వ ఏజెన్సీలతో వ్యవహరించేటపుడు ఈ రకమైన లంచం దోపిడీకి సమానమని సామాజికవేత్తలు అంటున్నారు. చాలా ప్రదేశాల్లో కంప్యూటరీకరణ జరిగినప్పటికీ 'వ్యాపార ముడుపులు' కొనసాగుతున్నాయి.

రోబోటిక్ విధానంలో షోల్డర్ రీప్లేస్‌మెంట్

- ఆపోలో వైద్యులు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ విధానం ద్వారా షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తు న్నట్లు హాస్పిటల్ షోర్డల్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పమ్మి కార్తీక్‌రెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మధన్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. నెల్లూరులోని అపోలో వైద్యశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్స గురించి వివరించారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో శస్త్ర చికిత్సలు చేసే విధంగా నూతన శకం ఆరంభమైందన్నారు. అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ విధానం అందుబాటులో ఉందని, దీని ద్వారా నూరు శాతం ఖచ్చితత్వంతో షోల్డర్ రీ ప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. రోబోటిక్ విధానం ద్వారా చేసే శస్త్ర చికిత్సల్లో నొప్పి శాతం చాలా తక్కువగా ఉంటుందని, రోగి వేగంగా కోలుకునే అవకాశం ఉందని వైద్యులు చెప్పారు. దీర్ఘకాలికంగా భుజం నొప్పి అధికంగా ఉన్నవారు, సాధారణ శస్త్ర చికిత్సల ద్వారా నయం చేయలేని ఎముక పగుళ్లు ఉన్నవారు, భుజం ఆపరేషన్లు విఫలమైన వారికి ఈ రోబోటిక్ విధానం ద్వారా షోల్డర్ రీ ప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స చేస్తే ఫలితం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

హై టెన్షన్ టవర్ల నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు

- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- పోలీసుల పహరా మధ్య కొనసాగుతున్న పనులు

ప్రజాశక్తి - వన్‌టౌన్, జి.కొండూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

తమ పొల్లాలో ల్యాంకో హైటెన్షన్ టవర్లు కొత్తగా ఏర్పాటు చేయొద్దంటూ విజయవాడ జక్కంపూడిలో ఆదివారం అంబాపురం, నైనవరం రైతులు ఆందోళనకు దిగారు. పనులను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. గత కొంతకాలంగా కోల్‌కతా, నూజివీడు, మైలవరం వెళ్లే జాతీయ రహదారి పక్కన గల జక్కంపూడిలోని రైతులకు చెందిన పొలాల్లో నుంచి 11 హై టెన్షన్ టవర్లు వేసేందుకు నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా సంకల్పించింది. జక్కంపూడి ప్రాంతంలో పొలాలు కలిగిన రైతులు తమ భూములు పనికి రాకుండా పోతాయని, నూతనంగా హై టెన్షన్ టవర్లు నిర్మించొద్దని పలుమార్లు నిరసనలు తెలిపారు. గత రెండు రోజులుగా ల్యాంకో, నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా అధికారులు పోలీసుల పహారా నడుమ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రైతులు తమ పొలాల వద్దకెళ్లి పనులను అడ్డుకున్నారు. వెస్ట్ ఎసిపి దుర్గారావు, టూటౌన్ సిఐ కొండలరావు, సిబ్బంది సహాయంతో రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు, సిరిపురపు సాంబశివరావు, ఆలూరి వెంకట సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు ముదిగొండ కోటేశ్వరరావు, మాతంగి ఆంజనేయులు, ముగడ సురేష్, నిమ్మగడ్డ జోగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డిలతో పాటు ఎనిమిది రైతులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

రోడ్డుపై బైఠాయించిన రైతులు, నాయకులు.

రాఘవరెడ్డికి నోటీసులు అందిస్తున్న పోలీసులు

ఎంపి అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డికి నోటీసులు

- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

సోషియల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌ల కేసులో ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ బండి రాఘవరెడ్డికి పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ నెల 9న విచారణకు కావాలని డిఎస్‌పి మురళీనాయక్ ఆదేశాలు జారీ చేశారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందులలోని రాఘవరెడ్డి ఇంటికి ఆదివారం సాయంత్రం పోలీసులు 41-ఎ నోటీసులు అందజేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు కడప క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఉదయం నుంచి కొనసాగిన హైడ్రామా

రాఘవ రెడ్డి ఇంట్లో ఉన్నారని సమాచారం అందుకున్న పోలీసులు పులివెందులలోని పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లారు. విచారణకు హాజరు కావాలని కోరగా నోటీసులు ఇస్తేనే విచారణకు హాజరు హాజరవుతానని ఆయన చెప్పారు. ఈ నెల 13 వరకు తనను అరెస్టు చేయకూడదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, నోటీసులు ఇస్తేనే విచారణకు హాజరవుతానని పేర్కొన్నారు. దీంతో, పోలీసులు వెనుదిరిగి వెళ్లిపోయారు. విషయాన్ని ఉన్నత అధికారులకు తెలిపారు. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులకు సంబంధించి నవంబర్ 8న పులివెందుల పోలీసు స్టేషన్‌లో రాఘవరెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. పోలీసులు అరెస్టు చేస్తారన్న ఉద్దేశంతో రాఘవరెడ్డి గత నెల రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఈ నెల 13వ తేదీ వరకు రాఘవరెడ్డిని పోలీసులు అరెస్టు చేయవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాఘవరెడ్డి పులివెందులలోని తన నివాసానికి వచ్చిన విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు.

గంజాయిపై ఉక్కుపాదం

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలో గంజాయిపై ఉక్కుపాదం మోపామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖలోని పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రాన్ని డిజిపి ద్వారకా తిరుమలరావుతో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఈ క్రమంలోనే ఆరిలోవలో పోలీస్ స్టేషన్‌ను కూడా ప్రారంభించామని తెలిపారు. సమాజంలో గుడి, బడితోపాటు పోలీస్ స్టేషన్ ముఖ్యమని పేర్కొన్నారు.

చాగంటి నియామకం సబబు కాదు

- ముఖ్యమంత్రికి 30మంది ప్రముఖుల బహిరంగ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా విలువల సలహాదారుగా, ఫ్యూడల్ విలువలను ప్రచారం చేసే ప్రముఖ పౌరాణిక ఉపన్యాసకులు చాగంటి కోటేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై పలువురు ప్రముఖులు నిరసన వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ అధ్యక్షతన ఆన్‌లైన్‌లో ఆదివారం సమావేశం జరిగింది. స్వాతంత్ర్య ఉద్యమ, సంస్కరణోద్యమాల విలువల ప్రచారం జరగాలని, రాజ్యాంగ విలువల ప్రచారం జరగాలని సమావేశంలో కోరారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం పునాదిగా ఉండే విలువలు ఆధునిక జీవితానికి అవసరమని అన్నారు. ప్రముఖ సినీ దర్శకులు సి ఉమామహేశ్వరరావు, ప్రఖ్యాత న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, ప్రఖ్యాత సాహితీ విమర్శకులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు ఐ వెంకటేశ్వరరావు, విద్యావేత్త రమేష్ పట్నాయక్, రచయిత బుడ్డిగ జమీందార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బహిరంగ లేఖ రాశారు.

లేఖ సారాంశం

'టిడిపి కూటమి ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధికి, విద్యార్థుల వికాసానికి పెద్దపీట వేసి ఆధునిక ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు కంకణం కట్టుకుంటుందని ఆశిస్తున్న మాలాంటి వారందరికీ విద్యార్థుల నైతిక విలువల కోసం పురాణ ప్రవక్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించడం నిరాశ కలిగించింది. విద్యా వైజ్ఞానిక సామాజిక రంగాల్లో చిరకాలంగా పనిచేస్తున్న మేము ఈ విషయంపై మా అభిప్రాయాల్ని మీకు బాధ్యతగా తెలియజేయాలనుకుంటున్నాము. మానవుడు ప్రకృతి రహస్యాలను ఒక్కోదాన్నీ గుప్పెట్లోకి తెచ్చుకొని, అంతరిక్షపు అంచులకు చేరుకుంటున్న కాలంలో మనం వున్నాం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఏ దేశాలు ముందున్నాయో అవే ప్రస్తుతం ఈతిబాధల నుండి బయటపడ్డాయి. ప్రపంచాన్ని శాసిస్తున్నాయి. వైజ్ఞానిక సంస్థలు మాత్రమే గాక ప్రజల్లో వైజ్ఞానిక దృక్పథం కూడా విస్తరించినప్పుడే ఈ శాస్త్ర సాంకేతిక విప్లవం సాధ్యమవు తుంది. ఏ రుజువుకు నిలబడని, కాలం చెల్లిన భావాల నుంచి, ఆచారాల నుంచి ఆయా దేశాలు బయటపడటం వల్లనే వారికీ వికాసం సాధ్యమైంది. దీన్ని గుర్తించే మన రాజ్యాంగం కూడా శాస్త్రీయ దృక్పథపు అవసరాన్ని నొక్కి చెప్పింది. ఇలా ప్రపంచమంతా పరుగులు తీస్తున్న ధోరణికి భిన్నంగా మన భవిష్యత్తరాన్ని పురాణ యుగంలోకి మళ్లించడం మనల్ని ఎక్కడికి తీసుకు వెళుతుందో తమ ప్రభుత్వం గుర్తించగలదని భావిస్తు న్నాము. మనది వైవిధ్య భరిత సాంస్కృతిక మూలాలున్న దేశం. ఈ భిన్నత్వమే మన శక్తీ, మన సౌందర్యమూను! దీన్ని కలకాలం నిలబెట్టుకో వడం ద్వారానే మనం సర్వతో ముఖాభివృద్ధి చెందగలం. ప్రపంచానికే ఒక నమూనాగా నిలబడగలం. సంకుచిత కుల, మత ప్రాంతీయ దృక్పథాలకతీతంగా మన భావితరం ఎదిగినప్పుడే మనం గొప్పగా చెప్పుకొంటున్న లక్ష్యాల్ని చేరు కోగలం. దీనికి తగినట్టు మన విద్యార్థుల్ని తీర్చగలిగేందుకు పౌరాణిక నీతులు ఎంతవరకు పనికొస్తాయో తాము ఆలోచించ గోరుతున్నాము. మన విద్యా విధానం ఏ మాత్రం శాస్త్రీయంగా లేదు. మన పిల్లలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. బలవన్మరణాలకు కూడా సిద్ధపడుతున్నారు. వాళ్ళ వికాసానికి, ఆత్మవిశ్వా సానికి తీవ్ర విఘాతాన్ని కలిగిస్తున్నది మన చదువులే. వ్యక్తిగా ఎదుగుతూ, సామాజిక జీవిగా పరిణితి చెందడం అనే లక్ష్యం నుంచి మన విద్యార్థులు నానాటికి దూరం దూరం జరుగుతున్నారు. దీంతో వారు ఒంటరి వాళ్ళవుతున్నారు. ఈ బాధాకర పరిస్థితి నుంచి మన విద్యార్థులను తప్పించి శక్తిమంతమైన విశ్వమానవు లుగా తీర్చిదిద్దడానికి మొదట మన విద్యారంగంలో తీవ్రమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. మన విద్యా లక్ష్యాలను పునర్నిర్మించుకోవాల్సి ఉంది. వీటిని వున్నట్టే వుంచి పురాణకాలపు నైతిక విలువలను బోధించడంతో ఏం ప్రయోజనం వుంటుందని మేము ఆవేదన చెందు తున్నాము. పౌరాణిక విలువలకు, ఆధునిక ప్రజాస్వామిక లౌకిక వైజ్ఞానిక విలువలకు ఏమాత్రం పొసగదని మా అభిప్రాయం. మన విద్యార్థుల్ని సమకాలీన ప్రపంచానికి సమర్థులైన ప్రతినిధులుగా తీర్చిదిద్దడంలో పౌరాణిక పండితులు చేయగలిగిందేమీ లేదని తెలియజేస్తూ ఈ వైపున తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆలోచించాలని కోరుతున్నాము' అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి రాసిన లేఖపై సంతకం చేసిన వారిలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ వి బాలసుబ్రహ్మణ్యం, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు ఎంవిఎస్ శర్మ, కత్తి నరసింహారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, ప్రొఫెసర్ అంజయ్య, ప్రముఖ రచయిత్రి ఓల్గా, అఖిలభారత న్యాయవాదుల సంఘం (ఐలు) అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్, వికాస విద్యా వనం వ్యవస్థాపకులు ఎస్ఆర్ పరిమి, 'దారి దీపం' సంపాదకులు డివివి ఎస్ వర్మ, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కమిటీ సభ్యులు బుడ్డిగ జమీందార్, ప్రొఫెసర్ అంజిరెడ్డి, విశాలాంధ్ర ప్రచురణలు సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు, విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, కవి, రచయిత గంటాడ గౌరు నాయుడు, చరిత్రకారులు, విమర్శకులు కాళిదాసు పురుషోత్తం, ప్రజా సైన్సు ఉద్యమ నాయకులు వి బ్రహ్మారెడ్డి, చెలికాని రామారావు మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు చెలికాని స్టాలిన్, చరిత్రకారులు, కవి కొప్పర్తి వెంకటరమణ మూర్తి, మానవహక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, సంగీత అకాడమీ అవార్డు గ్రహీత ద్వారం దుర్గాప్రసాదరావు, ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు, రచయిత అట్టాడ అప్పలనాయుడు, చరిత్రకారులు గార రంగనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ, 'సాహితీమిత్రులు' విశ్వేశ్వరరావు, పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య ఉన్నారు.

ఆన్‌లైన్‌లో బహిరంగ లేఖను విడుదల చేస్తున్న డివివిఎస్ వర్మ, సుంకర రాజేంద్రప్రసాద్, సి ఉమామహేశ్వరరావు, విఠపు బాలసుబ్రమణ్యం

ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై పన్ను విధించినందుకు..
బ్యాంక్ మేనేజర్‌పై దాడి

అహ్మదాబాద్: ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై పన్ను విధించి మినహాయించినందుకు బ్యాంక్ మేనేజర్‌పై ఒక వ్యక్తి దాడి చేసిన ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటు చేసుకుంది. ఎఫ్‌డిపై పన్నుపై మొదలైన వాగ్వాదం వారి మధ్య ఘర్షణకు దారితీసింది. వ్యక్తి అతడి తల్లితో పాటు అక్కడున్న వారు వారిని విడిపించేందుకు ప్రయత్నించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. శనివారం వస్త్రాపూర్ ప్రాంతంలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌కు కస్టమర్ జైమన్ రావల్ వెళ్లాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై పెరిగిన పన్నుపై ఆగ్రహం చెందాడు. దీని గురించి బ్యాంక్ మేనేజర్, అతడి మధ్య వాగ్వాదం జరిగింది. ఇది తీవ్ర ఘర్షణకు దారితీసింది. దీంతో వారిద్దరూ ఒకరినొకరు చొక్కా కాలర్ పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగి తలపై జైమన్ రావల్ కొట్టాడు.కాగా, తన కుమారుడ్ని నిలువరించేందుకు అతడి తల్లి ప్రయత్నించింది. అలాగే బ్యాంకులోని మిగతా సిబ్బంది కూడా కస్టమర్ జైమన్ రావల్‌ను ప్రతిఘటించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో మరో బ్యాంకు సిబ్బందితో కూడా అతడు ఘర్షణపడ్డాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంకులోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

అల్లూరి మహోజ్వల శక్తి

- విగ్రహ ఆవిష్కరణ సభలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి-ఉయ్యూరు (కృష్ణా జిల్లా)

భారతదేశ స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కీర్తించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామపంచాయతీ పరిధి రాజుపేటలో బోరుకాటి రామరాజు జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని బోరుకాటి జయప్రద ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. రత్నాగ్రూప్ ఫౌండర్, చైర్మన్ చిందా వెంకటేశ్వర్లు రాజు ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలసి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధపోరాటం ద్వారానే బ్రిటీష్ వారి కబంధ హస్తాల నుండి భారతదేశానికి విముక్తి కలిగించడానికి గిరిజనులను చైతన్యపరచి పోరాటం చేసిన స్వాతంత్ర సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి అని కొనియాడారు. స్వాతంత్ర పోరాటంలో మరుపురాని పోరాటానికి శ్రీకారం చుట్టారని, స్వాతంత్రం వచ్చాక చరిత్ర పుటల్లో అల్లూరికి దక్కవలసిన గౌరవం దక్కలేదని అన్నారు. ఆయనతో పాటు దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన అనేక మందికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, దీనికి ఆనాటి పాలకులే కారణమని పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. ఆయన త్యాగ ఫలితమే మనము అనుభవిస్తున్న స్వతంత్ర ఫలాలని తెలిపారు. సినీ హీరో కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి మాట్లాడుతూ విజయవాడలో తన భర్త విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అల్లూరి విగ్రహం ఏర్పాటు పట్ల నాయకుడు కొనకళ్ల బుల్లయ్య హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా అల్లూరి మనుమడు శ్రీ రామరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సంఘం చైర్మన్ పివి గిరి, యుపిఎ సభాపతి రఘురామ కష్ణంరాజు, సోము వీర్రాజు, అప్పలరాజు, బోరుకాటి ప్రసాద రాజు, చిందా కల్యాణ్ రాజు, చిందా కుటుంబ రాజు పాల్గొన్నారు.

ఉన్మాదిపై కఠిన చర్యలు

- ఎస్‌పికి ఇన్‌ఛార్జి మంత్రి సవిత ఆదేశం

ప్రజాశక్తి-కడప

వైఎస్ఆర్ జిల్లా వేముల మండలం కొత్తపల్లిలో యువతిపై ఉన్మాది కత్తితో దాడి చేసిన ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌పి విద్యాసాగర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కఠిన శిక్ష పడేలా చూడాలని సూచించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని తిరుపతి సిమ్స్ వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వేముల మండలం కొత్తపల్లిలో యువతిపై కుళాయప్ప అనే యువకుడు అతి కిరాతకంగా కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో యువతికి 11 చోట్ల కత్తి పోట్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దాడి చేసిన విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడి పరారీలో ఉన్న నిందితుడిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు.

ఇ-వేలం ప్రకటన
వరద బారినపడిన ఎలక్ట్రానిక్ ఐటెంలు & అప్లైన్సెస్.

ఆసక్తిగల కొనుగోలుదారులు "లం సం" ప్రాతిపదికన "వరద బారినపడిన ఎలక్ట్రానిక్ ఐటెంలు & అప్లైన్సెస్"ల డిస్పోజల్ కొరకు ఇ-వేలం లో పాల్గొనవలసిందిగా ఆహ్వానింపబడుచున్నది. **మెసర్స్ వినాయ ఎలక్ట్రానిక్స్ & హోమ్ నీడ్స్ న్యూ** కు చెందిన సదరు సాల్వేజ్‌ను "ఎక్కడ ఉన్నవి, అవి అక్కడ అలాగే ఉంటాయి" "నో కాంప్లైంట్" ప్రాతిపదిక విక్రయించబడుతాయి. సదరు మెటీరియల్స్‌ను **09.12.2024 నుండి 17.12.2024** మధ్య **ఉ॥ 11గం.ల నుండి సా॥6గం.ల** మధ్య మాత్రమే, షెడ్ నం.1/1, శ్రీ వేంకటేశ్వర షెడ్, ఆర్ఎస్ నం.10, వినాయక కార్పొరేషన్ ఎదురుగా, దర్గా ప్లాట్లు, టెంపుల్ రోడ్, భవానిపురం, విజయవాడ, ఆం.ప్ర-520012 వద్ద పరిశీలించవచ్చును. పరిశీలించుట కొరకు దయచేసి సంప్రదించండి: **శ్రీ తేజ చుండూరు, మొబైల్: 9703663666 లేదా శ్రీ గోవింద, మొబైల్: 9248113303.**

ఇ-వేలం నిర్వహణ తేది: 18.12.2024

ఇ-వేలం యొక్క నియమ& నిబంధనలు కలిగియున్న ఫారం పొందుటకు దయచేసి సంప్రదించండి: **శ్రీ శంషేర్ సింగ్, మొబైల్: 9709709992** లేదా వెబ్‌సైట్ https://www.sealthedeal.co.in/. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

వేలందారులు: సీల్ ది డీల్, రిజిస్టర్డు ఆఫీసు: 148, పాకెట్ సి2, సెక్టార్ 5, రోహిని, ఢిల్లీ-110085.

ఫారం & ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ దాఖలుచేయుటకు చివరి తేది 17.12.2024.

ప్రజా పోరాటాలకు పదును పెట్టాలి

మహాసభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

- విప్లవ స్ఫూర్తి కొనసాగించాలి
- సిపిఎం నెల్లూరు జిల్లా మహాసభలో వి శ్రీనివాసరావు పిలుపు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రజా పోరాటాలకు పదును పెట్టాలని, పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య విప్లవ స్ఫూర్తిని కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అత్యంత ఉత్సాహపూరితమైన వాతావరణంలో రెండు రోజులపాటు ఇందుకూరుపేటలో జరిగిన సిపిఎం నెల్లూరు జిల్లా 25వ మహాసభ ఆదివారం ముగిసింది. వి.శ్రీనివాసరావు ముగింపు ఉపన్యాసం చేశారు. నెల్లూరు జిల్లా సిపిఎం ఉద్యమానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య, శ్రీహరి వంటి ఎందరో నేతలు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఇక్కడ జరిగిన భూ పోరాటాలు, కూలి పోరాటాలు, సారా వ్యతిరేక ఉద్యమం రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయని వివరించారు. జిల్లాలో ఎన్నో ప్రాంతాల్లో వీరోచిత పోరాటాలు జరిగాయని, కొందరు హత్యకు గురయ్యారని, కేసులు, జైలు జీవితాలు అనుభవించారని గుర్తు చేశారు. దామరమగుడు, యల్లాయపాళెం, మర్రిపాడు, పెనుబల్లితోపాటు అనేక గ్రామాలు పార్టీకి బలమైన కేంద్రాలుగా నిలిచాయన్నారు. మళ్లీ ఆ గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీటిని ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు ప్రచారం చేయాలని, స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని సూచించారు. సిపిఎంపై జరుగుతోన్న సైద్ధాంతిక దాడిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు జిల్లాలో ఇటీవల మంచి పోరాటాలు నిర్వహించారని, ఎపి జెన్‌కో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, పోర్టులో కంటైనర్ టెర్మినల్ తరలింపునకు వ్యతిరేకంగా, భారత్ మాల, సమగ్రాభివృద్ధి ఇలా అనేక అంశాలపై ప్రజలను సమీకరించి పోరాటాలు చేశారని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకుల వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు. గ్రామగ్రామాన ఎర్రజెండా ఎగరాలని పిలుపునిచ్చారు. 45 సంవత్సరాల తర్వాత నెల్లూరు నగరంలో పార్టీ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని, 50 రోజులపాటు పార్టీ శ్రేణులు ఈ ఏర్పాట్లలోనే ఉండాలన్నారు. నిదుల సమీకరణ, జన సమీకరణ, ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర మహాసభ ఘనంగా నిర్వహించాలన్నారు. మహాసభ లో మొత్తం 18 తీర్మానాలను ఆమోదించారు. పూల సుబ్బయ్య, వెలిగొండ ప్రాజెక్టుకు వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, వక్ఫ్ చట్ట సవరణలు రద్దు చేయాలని, రామాయపట్నం పోర్టుకు కేంద్రం నిధులు పెంచాలని, కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధించాలని తదితర తీర్మానాలు ఉన్నాయి. మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా మూలం రమేష్


మూలం రమేష్

సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ 27 మందితో ఎన్నికైంది. కార్యదర్శిగా మూలం రమేష్ రెండోసారి ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్‌కుమార్, తుళ్లూరు గోపాల్, మూలి వెంగయ్య, ఎస్‌కె. రెహనా బేగం, ఎం.పుల్లయ్యలను ఎన్నుకున్నారు.

'కొవ్వాడ'కు కోనాడ ఉప్పు భూములు?

- పావులు కదుపుతున్న కేంద్రం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉప్పు భూములను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడలోని 144 ఎకరాల ఉప్పు భూములను కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంటుకు కేంద్రం అప్పచెప్పనుందని సమాచారం. తమకు ఆ భూములు కావాలంటూ అణు విద్యుత్ కేంద్రం యాజ మాన్యం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. కొవ్వాడ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఈ భూముల కోసం కేంద్రంతో సంప్రదించిన విషయాన్ని భీమిలి ప్రాంత సాల్ట్ ఆఫీసర్ కూడా ధృవీకరించారు. మరోవైపు కొద్ది రోజుల క్రితం ఈ భూములను పరిశీలించేందుకు వచ్చిన మారిటైమ్ స్పెషల్ ఆఫీ సర్ వచ్చారు. పూసపాటిరేగ తహశీల్దార్‌తో సమావేశమైనారు. దీంతో అణువిద్యు త్ కేంద్రానికి ఈ భూములను కట్టబెట్టడం ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

కీలకమైన ప్రాంతంలో...

జాతీయ రహదారికి సుమారు 7కిలో మీటర్ల దూరంలోనే కోనాడ ఉప్పు భూములు విస్తరించి ఉన్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు కూడా అత్యంత చేరువలో ఈ భూములు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఎకరా విలువ కోట్ల రూపాయల్లోనే పలుకుతోంది. ఈ నేపథ్యంలో సమీపంలోవున్న పవర్ ప్లాంట్ యాజమాన్యం కళ్లు పడి ఉంటాయని పలువురు భావిస్తున్నారు.

నాడు...నేడు

బ్రిటిష్ పాలన నుంచీ ఈ భూమిలో ఉప్పును సాగు చేసేవారు. అప్పట్లో కోనాడతోపాటు చుట్టుపక్కల గ్రామాలవారికి ఇది ఓ కీలకమైన ఉపాధి కేంద్రంగా ఉండేది. ఇక్కడి నుంచి నౌపడ తదితర ప్రాంతాల్లోని ఉప్పు కంపెనీలకు ఎగుమతి అయ్యేది. ఉప్పు సాగు, లోడింగ్, ఎగుమతి వంటి పనుల్లో భాగస్వామ్యమయ్యే జనాలతో ఈ ప్రాంతం ఎంతో సందడిగా ఉండేదట!. నేడు అ ఆనవాళ్లు తప్ప, ఒక్కసెంటులోనూ సాగు లేదు. 90శాతం భూమిలో దట్టంగా, ఏపుగా పెరిగిన చెట్లు ఉన్నాయి. ఇప్పటికీ పలు దిక్కులకు బ్రిటిష్ కాలంలో ఉప్పు తరలింపునకు వేసిన రోడ్లు మట్టిలో కలగలిపి కనిపిస్తున్నాయి. మధ్యమధ్యలో కొన్ని దశాబ్దాల వరకు సాగుచేసిన ఉప్పుచెరువుల ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. దట్టమైన అడవిలా ఉండడంతో రాత్రి పూట చమర పిల్లులను వేటాడడం, కట్టెలు ఏరుకొని విక్రయించడం వంటివాటితో కొందరు ఉపాధి పొందుతున్నారు. ఇదంతా ఓ చిన్నపాటి చిట్టడవిని తలపించేలా ఉండడం వల్ల రకరకాల పక్షజాతాలకు ఆలవాలంగా ఉంది. ఈ ఉప్పు భూములు, సముద్రానికి మధ్య కొంతమేర ఫారెస్ట్ ల్యాండ్ కూడా ఉంది. ఆ ఫారెస్ట్ లాండ్‌కు ప్రస్తుతం ఉప్పు భూములు భారీ కంచె మాదిరిగా కూడా ఉన్నాయి. ఈ భూములను అణు కేంద్రానికి అప్పగిస్తే ఇక్కడ ఉన్న జీవ వైవిధ్యం అంతరించడం ఖాయమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎన్‌ఎడి ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్లు తగదు

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన ఎన్‌ఎడి ఉద్యోగులు

ఎన్‌ఎడిలో 36 మంది కార్మికులపై అక్రమ సస్పెన్షన్లు విధించడం, ఆరుగురిపై పోలీసు కేసు పెట్టడం దారుణమని, మేనేజ్‌మెంట్ ఏకపక్ష చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు అన్నారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, ఎఐడిఇఎఫ్ అనుబంధ సంఘాల పిలుపు మేరకు ఎన్‌ఎడిసిఇ యూనియన్ ఆధ్వర్యాన ఎన్‌ఎడి ఉద్యోగుల దీక్షా శిబిరం నుంచి మేఘాద్రిపేట కాలనీ, జ్ఞానాపురం, చావులమదుం, అల్లిపురం, అంబేద్కర్ విగ్రహం మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఉద్యోగులు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో గంగారావు మాట్లాడుతూ విశాఖ చరిత్రలో ఏ పరిశ్రమలోనూ ఇంత మందిపై సస్పెన్షన్ చర్యలు తీసుకోలేదన్నారు. సస్పెన్షన్లు, ఛార్జ్‌షీట్లతో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే దేశ కార్మికవర్గం సహించదన్నారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఎన్‌ఎడి ఉద్యోగులకు విశాఖ కార్మికవర్గం మద్దతు ఉందన్నారు. అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కెఎం.కుమారమంగళం మాట్లాడుతూ రక్షణ రంగ ఉద్యమానికి అండగా ఉంటామని తెలిపారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ రక్షణ రంగంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం, యాజమాన్యాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, దీన్ని తిప్పికొట్టవలసిన అవసరముందని పేర్కొన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో విశాఖ రక్షణ రంగంలోని అన్ని గేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కె.నాగార్జున, అరుణ్, శ్రీనివాసరావు, దీన్ అహ్మద్, భాను, శేఖర్, నూకరాజు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్
RBL BANK apno ka bank
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 1వ లేన్, షాపూరి, కొల్హాపూర్-416001
సంప్రదించు చిరునామా: ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్, 9వఅంతస్తు, టెక్నిప్లెక్స్-1, ఆఫ్ వీర్ సావర్కర్ ఫ్లైఓవర్, గోరేగావ్ (వెస్ట్) ముంబయి-400062.
బ్రాంచ్ చిరునామా: ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నెం.6-48ఏ, గ్రౌండ్ ఫ్లోర్, సర్వే నెం.333, లాలుపురం గ్రామం, గుంటూరు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522017

SARFAESI చట్టం, 2002 సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు ప్రచురణ

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా దిగువపేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు)/తాకట్టుదారులు బ్యాంక్ నుండి వారు పొందిన క్రెడిట్/లోన్ సౌకర్యాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగిచెల్లించడంలో డిఫాల్ట్ అయినారు మరియు వారి రుణ ఖాతాలు **30.10.2024** తేదిన నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI యాక్ట్)లోని సెక్షన్ 13(2) ప్రకారం వారి చివరిగా తెలిసిన చిరునామాలపై నోటీసులు జారీ చేయబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారులు/ తనఖాదారు & ఖాతా నెం.	తనఖాపెట్టిన ఆస్తి	నోటీసు తేదీ / బాకీపడిన మొత్తం
1.	1) బొడ్డు కృష్ణ చైతన్య (రుణగ్రహీత) తండ్రి శ్యామ్‌ప్రసాద్, 2) శ్యామ్‌ప్రసాద్ బొడ్డు (సహ-రుణగ్రహీత 1) తండ్రి సుబ్బారావు 3) అనురాధ బొడ్డు (సహ-రుణగ్రహీత 2),అందరి చిరునామా: 6-165, నాథాలవారిపాలెం, అల్లూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522314. రుణ ఖాతా నెంబరు: 609000897012	గుంటూరు జిల్లా, తెనాలి రెవెన్యూ జిల్లా, మంతెనవారిపాలెం ఉపజిల్లా, పిట్టలవానిపాలెం మండలం, ఖాజీపాలెం గ్రామం, ఖాజీపాలెం గ్రామ పంచాయతీలోని సర్వేనెం.272/1 కలిగిన నివాస ఆస్తి యొక్క ఈక్విటబుల్ తాకట్టు/ రిజిష్టర్డు మోర్ట్‌గేజ్, విస్తీర్ణం 968చ.గ.లలోని శ్రీ బొడ్డు శ్యామ్ ప్రసాద్‌కు చెందిన ఆర్‌సిసి బిల్డింగ్ యొక్క 103.14చ.మీ.ల విస్తీర్ణం మొత్తం. సరిహద్దులు: తూర్పు: బొడ్డు శ్యామ్‌ప్రసాద్ ల్యాండ్, పడమర: పంచాయతీ సిసి రోడ్, దక్షిణం: పంచాయతీ సీసీ రోడ్, ఉత్తరం: బొడ్డు శ్యామ్‌ప్రసాద్ ల్యాండ్.	02.12.2024 / 02.12.2024 నాటికి రూ. 41,27,271.72/- (రూపాయలు నలభైఒక లక్షల ఇరవైఏడువేల రెండు వందల డెబ్బై ఒకటి & డెబ్బై రెండు పైసలు మాత్రమే)

* మొత్తం బకాయి మొత్తంలో రికవరీ చర్యలు, చట్టపరమైన ఖర్చులు, ఇన్సిడెంటల్ వ్యయాలు మరియు జప్తు ఛార్జీలు మొదలైన వాటితో అనుబంధించబడిన అదనపు ఖర్చులు ఉండవని దయచేసి గమనించండి.

ప్రదేశం: గుంటూరు
తేదీ: 09-12-2024
అధీకృత అధికారి
ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ గుజరాత్
(భారత పార్లమెంటు చట్టం, నెం.25 ఆఫ్ 2009 ద్వారా స్థాపించబడింది)
సెక్టార్-29, గాంధీనగర్ - 382 030
ఫోన్ నెం.079 23977407, ఫ్యాక్స్: 079 23260076
ఈ-మెయిల్: recruitmentcell@cug.ac.in, వెబ్‌సైట్: www.cug.ac.in

ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ నెం.సియుజి/02/2024-25

ఆల్ ఇండియా ప్రాతిపదికన వివిధ పాఠశాలలు/కేంద్రాలు/ డిపార్ట్‌మెంట్లలో రెగ్యులర్ టీచింగ్ మరియు నాన్ టీచింగ్ పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోసం అర్హులైన భారతీయ జాతీయుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి.

నియామకాలకు సంబంధించిన స్పెషలైజేషన్, అర్హత ప్రమాణాలు మరియు నిబంధనలను పేర్కొనే ప్రకటన వివరాలు మరియు షరతులు మొదలైనవి యూనివర్శిటీ వెబ్‌సైట్: www.cug.ac.in లో అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: **10/12/2024**, ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: **09/01/2025.**

తేదీ: 06/12/2024 సం/- రిజిస్ట్రార్ (Offg.)

CBC- 21357/12/0004/2425

ఫారం నెం.3
(రెగ్యులేషన్ 15(1) (ఎ)/16(3) చూచండి)
గౌరవ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II సమక్షంలో
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్: హైదరాబాద్

CASE O. A. NO. 292 OF 2021
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్, 1993లోని రూల్ 5 యొక్క సబ్-రూల్ (24)తో చదవగల చట్టంలోని సెక్షన్ 19 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద సమన్లు
ఎగ్జిబిట్ నెం.

జె.సి.ఫ్లవర్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్
వర్సెస్
మెసర్స్ రామక్రిష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఇతరులు

పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు

టు,
డి1) రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీల చట్టం, 1956 కింద నమోదైన కంపెనీ మరియు దీని రిజిస్టర్డ్ ఆఫీసు: డి.నెం.54-15-20, శ్రీనగర్ కాలనీ రింగ్ రోడ్, విజయవాడ, ఆం.ప్ర లో కలదు.
డి 2) శ్రీ కొక్కు ప్రభు వెంకట అంజనీ కుమార్ తండ్రి నారాయణరావు, వయస్సు 46సం॥లు, వృత్తి: వ్యాపారం, నివాసం: 40-5/3-14ఏ, ఫ్లాట్ నెం.103,హెచ్‌ఆర్టీ శ్రీ సాయి అపార్ట్‌మెంట్, టిక్కిల్ రోడ్, శ్యామ్‌నగర్, విజయవాడ-520 010, ఆంధ్రప్రదేశ్.
డి3) శ్రీమతి కొక్కు చిన్న విజయ దుర్గాదేవి, భర్త కెవిపి అంజనీ కుమార్, వయస్సు 41 సం॥లు, నివాసం: 40-5/3-14ఏ, ఫ్లాట్ నెం.103,హెచ్‌ఆర్టీ శ్రీ సాయి అపార్ట్‌మెంట్, టిక్కిల్ రోడ్, శ్యామ్‌నగర్, విజయవాడ-520 010, ఆంధ్రప్రదేశ్.
డి4) ఎస్‌బిఐ క్యాప్ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్, 8-2-684, ఎన్ఎస్ఎల్ ఐకాన్ బిల్డింగ్, 2వ ఫ్లోర్, డోర్ నెం.2/ఏ, రోడ్ నెం.12, అర్లాండ్ బంజారా కాలనీ, బంజారా హిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500 034.
ఏదైతే 30.09.2024న గౌరవ ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమయంలో ఓఏ/292/2021 జాబితా చేయబడింది.
చట్టంలోని సెక్షన్ 19(4) కింద పేర్కొన్న దరఖాస్తుపై **"వార్త" తెలుగు దైలీ** న్యూస్ పేపర్ మరియు విజయవాడ ఎడిషన్‌లో పేపర్ పబ్లికేషన్ ద్వారా మీకు సమన్లు జారీ చేయడానికి ఈ గౌరవ ట్రిబ్యునల్ అనుమతిస్తున్నందుకు (ఓఏ) మీకు వ్యతిరేకంగా మీపై **రూ.68,54,00,399.83/-** రుణం రికవరీ కొరకు దాఖలుచేశారు.
చట్టంలోని సెక్షన్ 19లోని సబ్-సెక్షన్ (4) ప్రకారం, మీరు, ప్రతివాదులు ఈ క్రింది విధంగా నిర్దేశించబడ్డారు.
(i) ప్రార్థించిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో సమన్లు అందిన ముప్పై రోజులలోపు కారణం చూపడం.
(ii) ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమసంఖ్య 3ఏ ప్రకారం దరఖాస్తుదారు పేర్కొన్న ఆస్తులు మరియు ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు లేదా అసెట్స్ వివరాలను బహిర్గతం చేయడం.
(iii) ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమసంఖ్య 3ఏ ప్రకారం బహిర్గతం చేయబడిన సెక్యూర్డు ఆస్తులు లేదా అటువంటి ఇతర ఆస్తులు మరియు ఆస్తులతో వ్యవహరించడం లేదా డిస్పోజల్ నుండి మీరు నిరోధించబడ్డారు, ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉంది.
(iv) ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమసంఖ్య 3ఏ క్రింద వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో తప్ప, సెక్యూరిటి ఇంట్రెస్ట్‌నుసృష్టించిన మరియు/లేదా ఇతర ఆస్తులు మరియు క్రింద పేర్కొన్న లేదా బహిర్గతం చేసిన ఆస్తులను మీరు విక్రయం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకూడదు.
(v) సాధారణ వ్యాపారంలో సెక్యూర్డు అసెట్స్ లేదా ఇతర అసెట్స్ మరియు ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు ఖాతాకు అందుబాటులో ఉంటారు మరియు అటువంటి ఆస్తులపై సెక్యూరిటీని కలిగిఉన్న బ్యాంకు లేదా ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్ వద్ద నిర్వహించబడే ఖాతాలో అటువంటి విక్రయ ఆదాయాన్ని డిపాజిట్ చేయాలి.
మీరు **తేది.10.12.2024న ఉ.10.30 గం.లకు** డెట్ రికవరీ ట్రిబ్యునల్-2, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001 వారి ఎదుట వ్యక్తిగతంగా లేదా తగిన సూచనలిచ్చిన న్యాయవాది ద్వారా ప్రార్థించిన ఉపశమనాన్ని ఎందుకు మంజూరు చేయకూడదనే దానిపై కారణాన్ని తెలియజేయవలసి ఉంటుంది.
ఒకవేళ విఫలం చెందినచో, దరఖాస్తు విచారించి మరియు మీకు పరోక్షంగా తీర్మానించబడుతుందని దయచేసి గమనించగలరు.
..........న ట్రిబ్యునల్ సీలు వేసి మరియు నా సాహస్తాలతో ఇవ్వబడినది.

రిజిస్ట్రార్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II,
హైదరాబాద్

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 9 డిసెంబర్ 2024

"మానవుడు శాస్త్ర జ్ఞానాన్ని తప్ప
మరే జ్ఞానాన్ని కోరనవసరం లేని
పరిస్థితి ఏర్పడుతుంది. దానికి
విరుద్ధంగా ఉన్న అన్ని అపోహలను,
నమ్మకాలను పూర్వపక్షం చేయడం పురోగామి
సాహిత్య లక్షణం."
– కొడవటిగంటి కుటుంబరావు

నగర కవి

నువ్వు నగర కవివి
ఫ్యాక్టరీ కవివి
గేటు దగ్గర ఉపన్యాసాలు చెప్పి
ఉద్యమాలకు ఊపిరి పోసిన వాడివి.

నీ జీవిత నుడికారమే వేరు
వృద్ధాప్యంతో వొంగిన ఇండ్ల ముందు
నిటారుగా నిలబడ్డ ధైర్యశాలివి
నువ్వు కవివి కాదు మనిషివి
ఇద్దరికి మధ్య తేడాను
తొలగించిన వాడివి

నారాయణ సుర్వే!
పాతికేళ్ల క్రితం
బొంబాయిలో ఒక్కసారే కావచ్చు
నిన్ను కలిసినందుకు
పులకించి పోయాను

దాదర్ ఆంధ్ర మహాసభలో
ప్రేమతో
నా జలగీతం మరాటీ తర్జుమా పండుగకు విచ్చేసి
జనావళి కళ్లను వెలిగించావు
నా చెవిలో
'పాణ్యాచగాణ' అన్నావు
జల పురుషుడు రాజేంద్ర సింగ్‌తో
కరచాలనం చేశావు.

ఈ మధ్య
నువ్విక లేవు అని తెలిసినప్పుడు
రాత్రంతా నిద్ర పట్టలేదు
బొంబాయి వీధుల్లో
నీ చేయి పట్టుకొని తిరుగుతున్నట్టే వుంది

నీతో గడిపింది ఒక గంటే
మళ్లీ కలుద్దాం మరు జన్మంటూ వుంటే.

(ప్రఖ్యాత మరాటీ కవి నారాయణ సుర్వే స్మృతిలో)

– డా.ఎన్.గోపి

మంచె మీద రైతు

వర్షం కురుస్తుంటే
సంతోషంలో ముద్దయిన నేను
పొగమంచు కురుస్తుంటే
తెల్లారి వాకిట్లో
ఉదయించే నేను.
పిట్టలు లేస్తుంటే
మంచె పిలుస్తుంటే
డప్పు వాయిద్యామైన నేను.

ఆకాశాన్ని కళ్ళలో నింపుకుని
ఉదయించే జొన్న కంకులని చూస్తూ
ఆశల విత్తులనీ నాటుకుంటాను
చుట్టూరా అరుస్తూ
పంటని కళ్ళ రెప్పల్లోంచి మోస్తూ
మంచె మీద తిరిగే రైతూ నేనే
కలలను విసురుతూ
రేపటి స్వప్నాలకి, ఇప్పటి శ్రమకి
వెలుగు పెట్టీ దరువు కట్టి
దిక్కులు పగిలేలా దండోరా వేస్తున్న
మంచె మీద
గాతాడ రైతూ నేనే రాజు నేనే.

– గవిడి శ్రీనివాస్
7019278368

అండమాన్ దృశ్యం

రోజూ పొద్దు పొడుస్తూనే ఉంటుంది
రోజూ పొద్దు కుంకుతూనే ఉంటుంది
తిన్న అన్నమే మళ్లీ మళ్లీ తిన్నట్లుగా
కొన్ని వేలసార్లు చూస్తూనే ఉంటాం
ఇక్కడ
సముద్రంలోంచి పొడుచుకొస్తున్న పొద్దును
సముద్రంలోకి మునిగిపోతున్న పొద్దును
రెంటినీ ఒకేచోట చూడటం ఓ అద్భుత దృశ్యం
ఎర్రటి మేఘావరణంలో
కళ్ళకింపైన సింధూర ముద్ద
అలా అలా సముద్రపు గొంతులోకి దిగిపోతుంటే
ఓ వింతైన అనుభూతి

మెరుస్తున్న వెండి తీరాల్ని
మాటి మాటికి ముద్దాడుతున్న
నీటి అలలు
పచ్చదనపు వేర్లు పరుచుకున్న
నీటి అంచులు
ఆకాశంలో తలలూపుతున్న
చెట్ల చివర్లు
గొడ్డలి ఆయుధం కనుమరుగైన చోట
చెట్లకు పెరగటం ఒక్కటే కళ
కొమ్మ ఎండి రాలడం ఒక సహజ క్రియ
బారాటంగ్ అడవుల పచ్చదనాన్ని
నింపుకున్న కళ్లు
నిలువెల్లా ఆకుల్ని మొలిపిస్తున్నాయి
ఒళ్ళంతా తెల్లని మట్టిని పులుముకున్న
జరావా ఆటవికులు అడవితల్లి కన్నబిడ్డలు
దారిదారంత ఎండపొడ పడనీయని మడ చెట్లు

అండమాన్ నువ్వొక
కాలుష్యం సోకని ప్రకృతి కాంతవి
మనిషి చెయ్యి తగలని
సముద్ర గర్భపు క్వరల్‌వి
రాస్ శిథిల భవనాలను చుట్టుముట్టిన
మర్రిచెట్టు వేళ్లలోని జీవానివి
నిన్ను అల్లుకున్న ఆలోచనల్లో
నువ్వొక సజీవ చైతన్యానివి!
(ఆకెళ్ల రవిప్రకాష్ గారికి)

– బండ్ల మాధవరావు

ఉషస్సు

కాలం మబ్బు తెరలు కమ్మిన
కొన్ని నాళ్ల చీకటి ఎప్పుడూ కాదే!
అది తెలియక తడబడిన నీ అడుగు
ఇదే ఎప్పటికీ కాదని తెలిసి వెలుగుకై
సాగే నీ పయనంలో నిజమెంత?

తిరిగొచ్చే రోజు ఒకటున్నదని,
మరువకు! రేపన్నది ఒకటున్నదని
చింతించకు! అడ్డదారిలో వెళ్లాలని!
నీ సహనమే గమ్యం కాక తప్పదు.
చీకటి వెలుగులు అన్నీ కలిస్తేనే జీవితం.

అంతమున్న అబద్ధానికి వంత పాడకు!
నిజమే శాశ్వతమని మరువకు!
మధ్య నీ గమనమే అద్దమవ్వాలి
సరికొత్తగా నీ మనస్సాక్షిని గెలవాలి.
సత్యమని గమనించుమా...

అకాల ప్రకృతి వైపరీత్యాలలో
సకాల అనవసర సందిలో....
మరి ఏది నిజమో తెలుసుకో,
మానవత్వపు జాడను వీడకు
విజ్ఞతనే నీ చిరునామా అని మరువకు!

– డా. చిటికెన కిరణ్ కుమార్
9490841284

తెలుగు నాటకరంగ వైభవ దర్శిని

తెలుగు నాటక చరిత్ర సుసంపన్నంగా శోభిల్లడానికి ఎందరో మహానుభావుల త్యాగాలు వెన్నెముకగా నిలిచిన సంగతి విజ్ఞులందరికీ తెలిసిందే. ఆ వైభవ పల్లకీని భుజాల మీద మోసిన ధృవతారలు అందించిన సేవలను, వారి జీవితాలను వ్యాసాల రూపంలో 'నాటక బంధం' అనే పుస్తకంగా అందించారు నటుడు, నాటక రచయిత, సాహిత్య, సాంస్కృతిక, నాటకరంగాల అధ్యయనశీలి బి.వి.అప్పారావు. ఈ పుస్తకం నిండా ఎన్నో విశేషాలు ఉన్నాయి.

'హరికథా' కళారూపాన్ని రూపుదిద్దీ తెలుగు శ్రోతలను ఆధ్యాత్మిక కళా సాగరాల్లో ఓలలాడించిన – శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు గారి జీవిత, కళారంగ విశేషాలు ఆత్మీయంగా పలకరిస్తున్నాయి. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అని మన రాష్ట్ర గీతాన్ని అందించిన శంకరంబాడి సుందరాచారి గారి జీవిత రహదారుల్లో మహావృక్షాల్లా నిలిచిన ఎన్నో సంగతులు ఈ పుస్తకంలో పలకరిస్తాయి. ఆధునిక నాటక సోమయాజి కుర్మా వేణుగోపాల స్వామినాయుడు గురించిన సంగతులు అక్షరబద్ధమై ఉన్నాయి. రాగద్వేషాలకు అతీతంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కృషి చేసిన కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు గారి చిరునవ్వులు ఈ పుస్తకంలో ఉన్నాయి. రచయిత రావి శాస్త్రి మరో విశిష్ట కోణాన్ని ఆవిష్కరించిన ప్రయత్నం ఈ పుస్తకంలో కనిపిస్తుంది. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలన్న నినాదం బళ్లారి రాఘవ గారిదైతే, తన కుటుంబ స్త్రీలను నాటకరంగ ప్రవేశం చేయించిన ఘనత ఆర్.వి.చలం గారిది. ఆయన గంభీర కంఠం ఈ పుస్తకం వేదికగా మనకు వినిపిస్తోంది. బహురూప నటచక్రవర్తి కుప్పిలి వెంకటేశ్వరరావు గారి విశేషాలను ఈ గ్రంథంలో తిలకించవొచ్చు.

రంగస్థలం మీద నాటకం కోసం తపస్సు చేసిన ఋషి కొత్తుర్తి భాస్కరరావు. ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అంగవస్త్రంగా ధరించిన ఆ మహాను భావుడి శాంతి, సహనాలు ఈ పుస్తకంలో వెలుగొందుతున్నాయి. తన నటనకు పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య గారి ప్రశంసలు పొందిన రుద్రరాజ్ కుమార్ రాజా ధరించిన జగ్గడు పాత్ర ఈ పుస్తకాన్ని అలంకరించిన ఒక విశేషం. విశాఖ నాటక కళామండలి దత్తపుత్రుడు దుగ్గిరాల సోమేశ్వరరావు నటించిన నా బాబు, పద్మవ్యూహం, దొంగ, తిరస్కృతి... మొదలైన నాటిక, నాటకాల్లోని ఆయన నటన ఎప్పటికీ చెదరని ఎల్లోరా శిల్పాల సరసన దర్జాగా స్థానం సంపాదించుకుంది. తెలుగు నాటకరంగంలో 'రావూజీ' అన్న పేరు ఒక సంచలనం. రికార్డుల మోతకు కేరాఫ్ అడ్రసుగా మారిన ఆయన నటజీవిత రంగుల చిత్రం ఈ పుస్తకంలో నమోదై ఉంది.

అపారమైన రాజకీయ పరిజ్ఞానం, అర్థ, అంగబలాలు కలిగిన పిళ్లా అప్పలనాయుడు సేవ, సాంస్కృతిక రంగాల వారధిగా చరిత్ర సృష్టించిన అంశాలు ఈ పుస్తకంలో ఆవిష్కృతం అయ్యాయి. నటనాలయం నాటక రచయిత మోదుకూరి జాన్సన్ చాలాముందు చూపున్న కవి, రచయిత. అందుకు సాక్ష్యంగా సంతకాలు పెట్టడానికి ఈ పుస్తకంలోని ఆయన విశేషాలు పోటీపడుతున్నాయి. కిన్నెర– ద్వానా శాస్త్రి స్మారక పురస్కారం అందుకున్న పాత్రికేయుడు గుండు వల్లీశ్వర్ ప్రస్తావన, విశేషాలూ ఈ పుస్తకంలో మనం చదవ్వొచ్చు. దాదాపు అయిదున్నర దశాబ్దాలు రచనకు అంకితమైన నిరంతర చైతన్యశీలి భీశెట్టి లక్ష్మణరావు. తన గుండెలో నాటకానికి గుడి కట్టిన నాటకరంగ ప్రేమికుడుగా ఆయన చిత్రపటం ఈ పుస్తకంలో దర్శనమిస్తోంది. నాటకం కోసం పరిషత్‌లు నడిపి తీవ్రంగా నష్టపోయినా సరే, తిరిగి అదే నాటకానికే అంకితమైపోయిన బి.ఎస్. చలం గారి దీక్షను ఇక్కడ గమనించవొచ్చు.

టిక్కెట్టు పెట్టి 'అడవి దివిటీలు' నాటకాన్ని 51 రోజులు ప్రదర్శించిన రికార్డుకు కారకులైన స్టార్ మేకర్ లంక సత్యానంద్ దర్శకత్వ ప్రతిభకు ఆనాడు మారుమ్రోగిన చప్పట్లు తిరిగి ఈ పుస్తకంలో డప్పుల్లా మ్రోగుతున్నాయి. హాస్యాన్ని తన భుజాల మీద ఊరేగించటానికి ఇష్టపడే నటుడు, దర్శకుడు బొట్టా వేణుగోపాలరావుకు సంబంధించిన నాటకరంగ విజయాలు, రహస్యాలు ఈ పుస్తక పుటల్లో నిలబడి వున్నాయి. శివుడికి నందీశ్వరుడు ఎలాగో, నాటకానికి భళ్ళమూడి రామమూర్తి అలాంటివారు. నాటకానికి ఆయన అందించిన సేవ ఈ పుస్తకంలో ఉంది. పర్వతమంత ప్రతిభను కలిగివున్నా అతి సామాన్యంగా కనిపించే కరి పద్మనాభాచార్యులు అజో–విభో– కందాళం ఫౌండేషన్ వారి సన్మానాన్ని పొందిన సందర్భం, విశాఖ కంఠాన మణిహారంగా నిలిచింది. తెలుగు నాటకరంగంలో నిష్కామ కర్మయోగిగా పేరొందిన డా. డి.ఎస్.ఎన్.మూర్తి నియమ నిబంధనలతో చేస్తున్న కళాసేవ... రాబోయే తరాలకు సైతం ఒక చక్కటి పాఠశాలగా దర్శనమిస్తోంది.

నాటకాన్నే శ్వాసగా మార్చుకున్న మహానటి కె.విజయలక్ష్మి గారి రంగస్థల విశేషాల ఎత్తులు ఈ పుస్తకంలో కొలువు తీరి ఉన్నాయి. తెలుగు నాటకరంగంలో చాలా గర్వంగా వినిపించే పేరు పిళ్ళా సన్యాసిరావు. ఆయక కృషి, సాధనా ఈ గ్రంథంలో పలకరిస్తోంది. గంభీరమైన నటనకు వారసుడుగా తగిన ముద్రను సంపాదించుకున్న ఎస్.ఎ. శ్రీరామమూర్తి గారి నాటకరంగ రేఖాచిత్రాలు, వాటి సత్తువలో రవివర్మ చిత్రాల సరసన చేరుతున్నాయి. దశాబ్దాలు గడిచినా హాస్యమనే ద్వారానికి అందమైన మామిడాకు తోరణంగా మారిన అత్యంత సహజ నటుడు సుత్తివేలు. ఆయన నటన, హాస్యానికి ప్రాణవాయువును విడుదల చేసే ఒక మహా వనంలా ఈ పుస్తకంలో అలరిస్తోంది. నాటకరంగ ప్రేక్షక ఖాతాదారులకు ఓ ఫిక్సిడ్ డిపాజిట్‌గా రాణించిన కొడుకుల వెంకట సుబ్బారాయుడు; 'పలుకే బంగారమాయె' నాటకంలో గిరీశం పాత్రకు జీవం పోసిన పి.ఆర్.జె.పంతులు; సాంఘిక నాటకరంగ నటుల్లో అరుదైన వ్యక్తిత్వం, క్రమశిక్షణ కలిగిన పైడికొండల జగన్నాధరావు; హరికథ కళారూపంతో హేతువాద దృక్పథాన్ని ప్రకటించిన గొప్ప కళాకారుడు సలాది భాస్కరరావు; 'గయోపాఖ్యానం' ద్వారా పి.వి నరసింహారావు గారి ప్రశంసలూ, అనేక నంది బహుమతులూ పొందిన డా. మీగడ రామలింగస్వామి గార్ల విశేషాలను జాగ్రత్తగా దాచుకునే గొప్ప సంపదలుగా ఈ పుస్తకం అందిస్తోంది.

విశాఖ నాటక కళాపరిషత్‌కు దాదాపు దశాబ్దం పైగా ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన పి.ఎస్.నాయుడు, తెలుగుభాషా సంస్కృతుల ఆరాధకులు దూసి ధర్మారావు, రెండు తరాలు పూర్తిగా మేకప్ రంగానికే అంకితమైన కుటుంబంలో జన్మించి, తరగని పేరు ప్రఖ్యాతలు పొందిన భరణి; హాస్యానికి కారణజన్ముడిగా జన్మించిన బ్రహ్మానందం, సంభాషణల గనిగా అటు నాటకరంగంలోనూ, ఇటు సినిమారంగంలోనూ కీర్తించబడిన గణేష్ పాత్రో.... వీరందరి ప్రతిభా విశేషాలు వ్యాసాలుగా ఈ పుస్తకం అందిస్తోంది.

ఈ పుస్తకం నిండా కొన్ని దశాబ్దాల నాటకరంగ చరిత్ర వుంది. వివిధ దశల్లో రంగస్థలాన్ని ఆక్రమించుకున్న పరిణామాలు, మార్పులు, చేర్పులు, దర్శకత్వ ప్రతిభలు, నటనా కౌశల్యానికి పట్టిన హారతులు, సువర్ణాక్షరాలతో లిఖించదగిన సందర్భాలు, సన్నివేశాలు, నాటకరంగ గౌరవ మరియాదలు... ఒక్కటేమిటి? వైభవోపేతమైన నాటకరంగ సారస్వత సంపద యావత్తు ఈ పుస్తకం నిండా పరుచుకొని ఉంది. ఈ అపురూపమైన గ్రంథ రూపకల్పనలో ఎంతో శ్రమపడిన బి.వి. అప్పారావు గారి అభిరుచి, సంకల్పమూ అభినందనీయం. ఎన్నో గ్రంథాల్లో నిక్షిప్తమైన నాటకరంగ వైభవాన్ని ఒకే పుస్తకంలో అందించడమే కాకుండా వాటికి తోడు నాటక రంగానికి సంబంధించి తాను రాసిన తొమ్మిది వ్యాసాలను ఆయన ఇదే పుస్తకంలో పొందుపర్చారు. పుస్తకం కోసం రచయితను 93470 39294 నెంబర్లో సంప్రదించొచ్చు.

– డాక్టర్ కె.జి.వేణు
98480 70084

'హరి'కథకు అమ్మ గౌరవం

కొందరు వ్యక్తులు తమ పని తాము చేసుకుంటూ పోతారు. అనేక రంగాల్లో తమ సేవలను అందిస్తూనే తామరాకు మీది నీటి బిందువులాగా నిలుస్తారు. అటువంటి అరుదైన వ్యక్తి, కీర్తి పురస్కారాలు, గౌరవ సత్కారాలు వంటివాటికి అతీతంగా నిలిచి విద్య, వైద్యం, సేవ, బాల సాహిత్యం వంటి రంగాల్లో మానవతా దృక్పథంతో ముందు వరుసలో నిలిచి పనిచేస్తున్న వేలాది మంది పిల్లల దేవమ్మ, 'తెలుగు థెరిసా' నన్నపనేని మంగాదేవి. 'చేతన' ద్వారా వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తూనే గత మూడు దశాబ్దాలుగా బాలలు, బాల సాహిత్య వికాసం కోసం పనిచేస్తున్న వారికి 'నన్నపనేని మంగాదేవి బాల సాహిత్య పురస్కారం' అందిస్తున్నారు. ఇప్పటివరకూ వసుంధర, మహీధర నళినీ మోహన్, చందమామ విశ్వనాథరెడ్డి, బుజ్జాయి, ముంజులూరి కృష్ణకుమారి, వాసిరెడ్డి రమేష్ బాబు, చొక్కాపు, దాసరి వెంకట రమణ, చంద్రలత, మంచిపుస్తకం సంస్థ, బాలి, కందేపి రాణీప్రసాద్, సమ్మెట ఉమాదేవి మొదలుకుని ఈ వ్యాసకర్త వరకు ఆ పురస్కారాన్ని అందుకున్నారు. నోబెల్ డేగా ప్రసిద్ధి చెందిన డిసెంబర్ 10న గుంటూరు శ్రీ వెంకటేశ్వర బాల కుటీరంలో జరిగే ఈ పురస్కార ప్రదానం మంగాదేవితో కలిసి సేవారంగంలో పనిచేసిన ప్రభావతి గారి యాదిలో జరుగుతుంది.

2024 సంవత్సరానికి ఈ సాహిత్య పురస్కారాన్ని బాల సాహితీవేత్త, ఉపాధ్యాయుడు, కవి, సంపాదకులు డా.ఎం. హరికిషన్ అందుకోనున్నారు. హరికిషన్ మూడు దశాబ్దాలుగా కథా సాహిత్య సృజన, ఇరవై మూడేండ్లుగా బాల సాహిత్య సృజన చేస్తున్నారు. బాల సాహిత్యంలో సంప్రదాయ జానపద కథలతో పాటు ఒత్తులు లేని గేయాలు, కథల వంటి ప్రయోగాలను కూడా చేశారు. తన ప్రాంతపు వారసత్వ సాహిత్య సంపద మీద మక్కువతో దానిని రేపటి తరానికి అందించేందుకు విలక్షణ మౌఖిక సాహిత్యాన్ని సేకరించి సంకలనాలుగా అందించాడు. తరగతి గదిని తన సాహిత్య సంప్రదాయాల ఆటస్థలంగా మార్చుకున్న ఈయన ... అందుకోసం ప్రతి క్షణాన్ని వినియోగించుకుని అందరికంటే భిన్నంగా నడిచి, సోషల్ మీడియా గ్రూపులు, అంతర్జాల సమూహాలను తన వేదికగా చేసుకున్నాడు. రచయితగా ఎంతగా తనదైన శైలిలో రాశాడో రాయలసీమ బిడ్డగా తన నేల నుంచి వెలుగు చూసిన సాహిత్యాన్ని వివిధ సంకలనాలుగా తెచ్చాడు. రాయలసీమ హాస్య కథలు, వ్యంగ్య కథలు, ఉపాధ్యాయ, రచయిత్రుల కథలతో పాటు ఆ నేల జీవికకు చిత్రిక పట్టే 'కరువు కథలు' సంకలనాలుగా తన సంపాదకత్వంలో ప్రచురించాడు. కొండారెడ్డి బురుజు, కర్నూలు జిల్లా చరిత్రతో పాటు అక్కడి మహనీయుల గురించి రాశాడు. ఇంతవరకూ వెలువరించిన 72 రచనలు ఆయన ప్రతిభకు, ప్రయత్నానికి అపూర్వ నిదర్శనాలు.

మంగాదేవి పురస్కార గౌరవం అందుకోవడానికి మూలంగా నిలిచింది హరికిషన్ సృజించిన అపారమైన బాల సాహిత్య సంపద. తన రచనలకు జీవభాషలో పేర్లు పెట్టడం ఆయనకు బాగా తెలుసు. 'నక్క బావ–పిల్లి బావ', 'చిలకముక్కు పూడిపాయె...', 'నలుగురు మూర్ఖులు', 'కిర్రు.. కిర్రు.. లొడ్డప్పా!', 'ఉంగురు బిళ్ళ', 'ఒకటి తిందునా.. రెండు తిందునా..', 'మాయమ్మ రాచ్చసి', 'నల్లకుక్క', 'దెబ్బకు ఏడుమంది' వంటివి అందుకు ఉదాహరణలు. ఇంకా.. 'చందమామ చెప్పిన కథలు, రాము టోపి, మోగాళ్ళ దేశం, పుచ్చకాయ తపస్సు, సముద్రంలో చిన్న చేప, బూర, పిల్లలు కాదు పిడుగులు, అమ్మో దయ్యం, పిల్లల హాస్య కథలు' వంటి మరికొన్ని రచనలు హరికథలకు చిరునామాలు. 'వంద రోజులు వంద కథలు' పేరుతో దాదాపు వేయి రోజులుగా తానే స్వయంగా ఆయన కథలు చెబుతున్నాడు. వేలాదిమంది తెలుగు పిల్లలకు సోషల్ మీడియా ద్వారా వాటిని వినిపిస్తున్నాడు.

హరికిషన్ రచనలు పిల్లల వయస్సు, స్థాయిలకు అనుగుణంగా ఉంటాయి. పాఠశాల పూర్వదశ పిల్లల కోసం పెద్దలు చదివి వినిపించే గేయాలను 'రేపటి వెలుగులు'గా వ్రాయగా, కర్నూలు బుక్ ట్రస్ట్ తెచ్చింది. ఈ పుస్తకంలోని గేయాలన్ని ఒత్తులు లేకుండా సాగడం విశేషం. ఇంకా 'చిన్నారి గేయాలు', 'పిల్లల జానద గేయాలు', 'రేపటి వెలుగులు', 'తేనె చినుకులు' వంటి బాల గేయాల సంపుటాలు, సంకలనాలు తెచ్చారు. పిల్లల మనసులకు నచ్చేవిధంగా రాయడం ఈ బడి పంతులుకు బాగా తెలుసు. హరికిషన్ రాసిన కథలు, నవలలు కూడా కొంత కొత్తగానే కనిపిస్తాయి. 'మిన్ను', 'చిన్ను–మిన్ను', 'అందమైన అబద్దాలు – కమ్మని కథలు', 'యువరాణి లాస్య' వంటి రచనలు అందుకు ఉదాహరణగా చూడొచ్చు.

హరికిషన్ తొలుత కథా రచయితగా వ్యాసంగాన్ని మొదలుపెట్టినప్పటికీ, తరువాత బాల సాహిత్యంలో విశేష కృషిచేసి తనదైన ముద్రను వేసుకున్నాడు. సంపాదకులుగా, రచయితగా, సేకర్తగా, నవల, కథ, గేయాలకర్తగా, స్టోరీటెల్లర్‌గా తన స్వీయశైలిని 'హరి'కథ' అన్న ముద్రతో నిలిచాడు. బాల సాహితీ రంగంలో ఇష్టంగా, అత్యంత ప్రేమగా రచనలు చేస్తున్న డా.హరికిషన్ కృషికి గతంలో 'అజో–విభో' గౌరవం దక్కింది. ఇప్పుడు బాల సాహిత్యంలో అత్యంత ఉన్నతమైన 'మంగాదేవి పురస్కారం' అందబోతోంది. డా.హరికిషన్‌తో కలిసి నడుస్తూనే ఆయన సాహితీ సృజనలో భాగమైన సహచరి డా.చంద్రమౌళినికి ఆయన ప్రతి విజయంలో భాగముందనడం అతిశయోక్తి కాదు.

–డా. ప్రత్తిపాక మోహన్

నాలో నిద్రపోతున్న నగరం

నిద్ర రానప్పుడు
నగరాన్ని ఎదురుగా కూర్చొనపెట్టుకుంటాను.
ఎప్పుడు చూసినా రంగులు మారే ఆకాశంలా
ఎప్పుడు చూసినా రంగులు మార్చే వుంటుంది
నగరం.

నగరం కడుపులో ఏముంటుందో గాని
నగరాన్ని చూస్తే నా కడుపులో
దిగులుగా వుంటుంది.
స్థలం లేకపోయినా
ఇద్దరి మధ్య ఇరుక్కొని కూర్చున్నట్టు
నగరం మధ్యలో నేను
ఇరుక్కున్నానని అనుకున్నాను
కానీ, నగరం చేతులు చాచిన ఆకాశం
నేనే బావి నీళ్ళలో తేలుతున్న ఆకాశం!
ఆకాశాన్నంటే భవనాలను చూసి
అసింట పోతుంటాను గానీ

అది కొందరి కలల సౌధాలని అనుకోలేను
ఖరీదైన విలాస విరామ జీవితం చూసి
కలవరపడతా గానీ
చెమట చుక్కల శ్రమనో, మేథో కష్టమో
ఎవరిదైనా ఎవరైనా
అందరి గమ్యం అదే కదాని అనుకోలేను

బోనులో వున్న పులిని భీతిల్లి చూస్తున్నట్టు
నగరాన్ని భీతిల్లి చూస్తున్నా
నిద్రలో దాని గాండ్రింపులు వినపడుతున్నాయి
సముద్రాన్ని ఎదురుగా పెట్టుకొని
చెవులు మూసుకున్నా
అలల ఘోషలు వెంటాడుతున్నాయి

నగరంలోకొచ్చి నగరాన్ని
తప్పించుకు తిరగడం
సముద్రంలో మునిగిపోతూ
ఈత కొట్టకుండా వుండడం ఎంతకని సాధ్యం ?

వేపచెట్టుని రావిచెట్టు పెనవేసుకున్నట్టు
పెనవేసుకుంటుంది నగరం
ఊరే కాదు నగరం కూడా
మనిషిలో తల్లివేర్లు దించుతుంది

అడవులు, నదులు మాయమయి
నగరాలు వెలిసాయి కదా..
మరి నగరం మొలిచిన నేలలో
తడి హృదయాలు తారాడవా ?
నగరానిది రాతి ముఖమే గానీ
హృదయం కూడా రాయేనా?

నిద్ర రానప్పుడు
నగరాన్ని ఎదురుగా కూర్చోబెట్టుకుంటాను
నోరు విప్పదు గానీ గుండెలు విప్పుతుంది
కళ్ళలో నీళ్ళతో ఊరిని చూసిన కళ్ళతో
నన్నూ చూడమంటుంది.

క్షణం కళ్ళు మూసుకుని నాలో చూసుకుంటే
నేను నగరంలో వున్నాను
నగర కీకారణ్యంలో
గిరికీలు కొట్టే పక్షిలా వున్నాను
నగరం నాలో ఉరవళ్ళు పెట్టే
నదిలా ఇంకిపోయి వుంది

నగరం నా ఎదురుగా కూర్చొని
తన మరో చెంప చూయించింది
తన మీద పాకిన కొన్ని తీగలకి
బతికిన కలలు కొన్ని బహుకరించింది
కలలు కనే అనేక కళ్ళకి
చోటిచ్చిన తన ఒడి చూయించింది
అభివృద్ధి అనకొండ
తన పిల్లను నోటకరుచుకుని చుట్టుకుంటుంటే
అరుస్తున్న ఆవులా అనిపించింది

మిరుమిట్లు గొలిపే తన కళ్ళ వెనుక
జాలి గొలిపే మూగ కథలెన్నో మూట విప్పింది

శతాబ్దాలుగా ఒలకని కన్నీటిచుక్క నగరం
జీవితం వెనుక పాకులాడలేక
కూలిన ఆశలగూడు నగరం
రేయింబవళ్ళు పరిగెత్తి పరిగెత్తి
అహోరాత్రులు మేలుకొని మేలుకొని
అలసిపోయిన నగరం
తన కతలు చెపుతూ చెపుతూ
అలాగే నాలో నిద్రకు ఒరిగింది

ఏ పాపమెరుగని పసిపాపలాగో
కడుపు నిండి క్రూరమృగం లాగో
నగరం నాలో నిద్రపోతోంది!

– పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

కవి ఏటూరి అంతరంగ నాదం



తెలుగు కవిత్వంలో సుదీర్ఘయానం చేసిన సుపరిచిత కవి ఏటూరి నాగేంద్రరావు. చదువు ఎగ్గొట్టి మద్రాసు రైలెక్కేసి, కొన్నాళ్ళు సినీ గీతరచయిత వేటూరి వద్ద పనిచేశాడు. వేటూరి బుజ్జగించి, చదువుకోమని పంపేస్తే ఇంటిముఖం పట్టాడు. బుద్ధిగా చదువుకొని భారతీయ రైల్వేలో ఉద్యోగం సంపాయించాడు. విపరీతమైన నాటకాపేక్షతో విరివిగా నాటకరంగం వారితో తిరిగేవారు. మౌఖికంగా మంచి నాటక విమర్శ చేసేవారు. కావలి ప్రసిద్ధ కథకులు డా.వీరపల్లి ఆంజనేయ నాయుడు నాటక రచయితగా రూపాంతరం చెందడానికి దోహదపడ్డాడు. ఎక్కువగా బుచ్చి, నెల్లూరు నాటక పరిషత్‌ల వారితో పరిచయా లున్నా– ఒంగోలు వారితో మరీ ఎక్కువ. నల్లూరి అన్న, ఎం.వి.ఎస్.హరనాథరావు, టి.కృష్ణ, వి.ఎస్.కామేశ్వరరావు, మల్లేశ్వరరావు, పోకూరి బాబూరావులతో కలిసి నాటకరంగం చుట్టూ తిరిగేవారు.

కవిగా రేపటి గీతం, కర్టెన్స్, ఢమరుక్స్, మనిషి వాసన, పూవులు సమ్మె చేస్తాయి, కలల ఖర్ఖానా అనే కవితా సంపుటాలు వెలువరించారు. 'దగ్ధ పల్లవుల పాట' అనే ఒక దీర్ఘ కవితను రాసి, ప్రచురించారు. తాజాగా 'అలా, ఆగు కాసేపు' అనే కవితా సంపుటిని వెలువరించారు. ఢమరుక్స్ పుస్తకం సామాజిక వ్యంగ్యాస్త్ర మినీ కవిత్వం పూర్తిగా నేను రూపొందించి, నెరసం ద్వారా ప్రచురించినదే. ఇప్పటి కొత్త సంపుటి 'అలా ఆగు, కాసేపు...'లోని అన్ని కవితలూ ఒకే అంతస్సూత్రం గా సాగాయనిపించింది. విశ్రాంత జీవితంలో, నెమరువేతల దశలో ఎన్నో జీవిత అనుభవాల్ని, నిర్వేదాన్ని గొప్పగా రాశారు. ఒక విలక్షణ గొంతుతో ఆవేదన, ఆర్తి, నిజాయితీగా వినిపించారు. ముఖ్యంగా కవి ఆత్మఘోషను అక్షరీకరించారు.

'వెల్ల వేయండి' అనే కవితను 'ఆ ప్రాచీన గోడకి వెల్లవేయరేం?' అన్న ప్రశ్నతో మొదలెట్టారు. సూటిదనం ఏటూరి కవిత్వ లక్షణం. కవితల్లో ఎక్కడా డొంక తిరుగుడు ఉండదు. అసలు గోడలకు వెల్ల వేయడం ఎందుకు? వెలిసిపోయి అందవిహీనంగా ఉన్న వాటికి మళ్లీ నూతనత్వం అద్దటానికే కదా? ఎన్నో గాధల్ని తనలో యిముడ్చుకున్న భూతకాలాన్ని తల్చుకోకుండా, తడుముకోకుండా ఎలా వదిలేస్తున్నారో అని బాధను వ్యక్తం చేస్తాడు. 'అమరుల త్యాగాన్ని/ విస్తరించి చూపిన/ దృశ్య మాధ్యమ రూపం అదీ' అని గుర్తు చేస్తాడు. 'నిదురలో కూడా/ కర్తవ్యాన్ని కలవరిస్తుంది' అంటాడు. 'నిజానికి దానికి/ చాలా పని ఉంది/ స్పష్టమైన ఆకారాన్నివ్వండి' అంటాడు. ఎందుకట? 'అత్యద్భుతంగా/ ఆకలి అస్థి పంజరాల్ని/ మనిషిలోని స్వార్థపు కురుపుని/ చిత్రించాలి' అని తనే సమాధానమిస్తాడు. 'ఈ గోడలోని మౌనం/ ఎంత భయంకరంగా శబ్దిస్తుందో వినాలి'. అందుకే 'ఆ గోడకి వెల్లవేయండి' అని ముగిస్తాడు కవితను. గత వైభవాల్ని తలుచుకుంటూనే, భవిష్యత్తులోకి సాగిపొమ్మని సందేశమిచ్చే గొప్ప కవిత.

నాటకాన్ని నిజ జీవితానికి సమన్వయం చేస్తూ బతుకు మాత్రం తెరపడని నాటకం అంటాడు 'తెరపడని నాటకం' కవితలో. జీవిత రంగంలో 'ఒక కనుపించని ఉక్కపోత గుండె నిబ్బరంపై/ తుపాను పోరుగా మొలవుతుంది/ ఎన్నిసార్లు ఆశల్ని మూట గట్టుకున్నా/ అక్కడ కూడా/ విషాదకర శూన్యం విస్తరించి ఉంటుంది' అంటాడు. జీవితం ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ, మళ్ళీ ఏదో ఆశాభావంతో పైకిలేచి కర్తవ్యాన్ని స్మరించుకొని నిలబడ్డా మళ్ళీ విషాదకర శూన్యమే ఎదురైతే ఏమి చెయ్యాలి? 'ఒక చెరిగిపోయిన దృశ్యం రెండుగా చీలి/ రాళ్ళు పడిన చప్పుడు చేస్తోంది' అనడంలో ఒక గొప్ప తాత్వికతే కాదు; అధివాస్తవికత కూడా ఉంది. 'గోరు వెచ్చని నీటిలో స్నానం చేస్తూ/ తలుపులు మూసు కొన్నాను/ బతుకెప్పుడూ తెరపడని నాటకమే!' అంటాడు. బాధలు కన్నీళ్ళు చికాకులు, చింతలూ కాయం ఉండే వరకూ ఉండేవే. అన్నమయ్య 'మదిలో చింతలు మైలలు మణుగులు వదలవు నీవవి వద్దనక' అన్నట్టుగా 'నానాటి బదుకు నాటకము' అన్న చందాన జీవితం తెరపడని నాటకమని గొప్ప నిర్వచనమిస్తాడు ఏటూరి.

'విడిపోతుంటాను' అనే మరో కవితలో– 'ఎవరూ ఎవరితోనూ ఆగిపోలేదు/ చరిత్రను తొక్కుకుంటూ/ నిద్ర కరిగిన కలలతో తిరుగు తుంటారు' అనే ప్రారంభించాడు. ఏదీ ఎవరి కోసమూ ఆగదనీ, అన్నీ యథావిధిగా, పాతను మరచి కొత్తను వెదుక్కుంటూ సాగిపోతుంటాయని చెప్తూనే, 'అందరూ ఒకే ఒక్క ముఖాన్ని/ వేల ముఖాలుగా ధరించి ఉన్నారెందుకో' అనడంలో గొప్ప స్ఫురణ కలిగిస్తాడు. మనిషి తనకున్న ఒక్క ముఖంలోనే సంతోషం, విచారం, ఆవేశం, ఆక్రోశం ఎలా ప్రదర్శిస్తున్నాడని ఆశ్చర్యం ప్రకటిస్తున్నాడు. 'అలసట తాకని మనిషి కోసం/ ప్రతి రాత్రీ ముఖాల్ని తడిమే పాటను/ నా చేత పలికిస్తూనే ఉంటుంది/ నా నుంచీ నేను విడిపోతుంటాను' అని చెబుతూ, 'కృత్రిమ వేషధారణ ధరించని మనుషుల కోసం నేను నా నుంచీ విడిపో తుంటాను' అంటాడు. ఇలా విడిపోవడం అంటే పరాయీకరణ చెందడం (ఎలియనేషన్). ఈ పరాయీకరణ సిండ్రోం అనే పదబంధాన్ని మొదటిసారిగా 1985లో డాక్టర్ రిచర్డ్ ఎ.గార్డనర్ ఉపయోగించారు. అంటే మనిషిలోని స్ప్లిట్ పర్సనాలిటీని ఇది బయట పెడుతుంది.

'మరో మజిలీ' అన్న కవితలో 'నా కళ్ళు ఏవో చెప్పడానికి ప్రయత్నిస్తుంటాయి/ అవి ఎప్పుడూ ఎర్రగా మండుతూ/ ఓ జీవిత కాలపు అనుభవా లను ప్రశ్నిస్తుంటై' అని ప్రారంభించి, తన జీవితాన్ని, చేదు అనుభవాలను మనముందు పరవడానికి సిద్ధమయ్యాడు. 'నా మరో మజిలీలో నేను నా ఓడను మరమ్మతు చేసుకోవాలి' అన్నాడు. ఓడ అంటే జీవితపు నావ. దాన్ని కొంచెం రసవంతంగా ఉండేట్టు చేసుకోవాలి అంటున్నాడు. 'నేను చెయ్యాల్సింది/ చాలా ఉంది/ ఎలా తప్పించుకోగలను..!' అని వాస్తవిక రేఖపై నిలబడ్డారు. 'విశ్వవ్యాప్తంగా నా కషిని కొనసాగి స్తూనే ఉంటాను' అని చెప్పటం గొప్ప ముగింపు.

ఈ పుస్తకానికి ముందుమాటలో ప్రసిద్ధ విమర్శకులు శ్రీరామకవచం సాగర్ ... కమ్యూనిజం నుంచి కాన్సుమరిజమ్ దాకా కవి చేసిన సాహిత్య ప్రయాణం, ఈ చరమాంక దశ కవిత్వాన్ని అంతిమంగా పరికిస్తున్నదని అన్నారు. ఒక కాలాన్ని నమోదు చేసిన కవి డైరీలా వుందన్నారు. వస్తువు ఆధారంగా కవిత్వం చెప్పే దశ దాటి కవి నైరూప్య భావాలను కవితలుగా ప్రసారం చేయటం ఈ సంపుటిలో విస్తృతంగా చూస్తామని అన్నారు. మానవత్వపు విలువల్ని బతికించాలన్న తపనతో తన ఆలోచనల్లో నుంచి రాలిన శకలాలే తన కవిత్వమన్న కవిని స్వాగతిద్దాం.

– డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

15న గుంటూరులో సోమేపల్లి సాహితీ సౌరభం

డిసెంబర్ 15న ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గుంటూరులోని కాటన్ అసోసియేషన్ హాలులో సోమేపల్లి సౌరభం కార్యక్రమం జరుగుతుంది. సోమేపల్లి వెంకట సుబ్బయ్య స్మారక సంచిక ఆవిష్కరణ, సోమేపల్లి సాహిత్య సదస్సు, సాహితీ పురస్కారాల ప్రదానం, పుస్తకావిష్కరణలు ఉంటాయి. మూడు విభాగాలుగా జరిగే కార్యక్రమంలో పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్, తోటకూర వెంకట నారాయణ, మానుకొండ ఉపేంద్ర, షేక్ ఇస్మాయిల్, ఐ రమేష్ బాబు, వెలువోలు నాగరాజ్య లక్ష్మి, సుంకర గోపాలయ్య, కె.జె.రమేష్, షేక్ కాశింబి, సి.భవానీదేవి, కాట్రగడ్డ దయానంద్, సోమేపల్లి విజయలక్ష్మి, రాచమల్లు ఉపేంద్ర తదితరులు పాల్గొంటారు. సభలో 'ప్రాతఃస్మరణీయులు' పుస్తకావిష్కరణ వుంటుంది.

– ఆహ్వాన కమిటీ తరపున చలపాక ప్రకాష్, ఎస్.ఎం సుభాని, శ్రీ వశిష్ఠ

14న 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' ఆవిష్కరణ

డిసెంబరు 14న హైదరాబాద్ రవీంద్రభారతి మినీ హాల్లో కుందుర్తి కవిత కవిత్వ సంపుటి 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్'; ఫ్రీవర్స్ ఫ్రంట్ వాట్సాప్ సమూహం పోటీ కవితల సంకలనం 'ఆనవాళ్ళు' ఆవిష్కరణ ఉంటాయి. సభలో శివారెడ్డి, శిఖామణి, శీలా సుభద్రాదేవి, అనిల్ డ్యానీ, శ్రీరామ్, సమత పాల్గొంటారు.

– ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రచురణలు

జైల్లోనే రైతుల నిరాహార దీక్ష

- శంభు సరిహద్దు వద్ద రైతులపై మళ్లీ టియర్ గ్యాస్ ప్రయోగం
- 10 మందికి గాయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించాలని కోరుతూ ఆందోళనల్లో అరెస్టయిన రైతులు జైల్లో నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా జైలులో రైతులు నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తెలిపింది. గ్రేటర్ నోయిడాకు చెందిన 150 మందికి పైగా రైతులు జిల్లా జైలులో ఉన్నారు. తమ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి తగిన పరిహారం, అభివృద్ధి చేసిన భూమికి పది శాతం వాటా కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో ఎస్‌కెఎం వారం రోజులుగా నిరసనలు చేస్తోంది. ఆదివారం కూడా నోయిడాలో రైతులు నిరసన తెలిపారు. మరోవైపు యుపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. 1997 నుంచి వివిధ ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన వారి జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సరైన నష్ట పరిహారం చెల్లించడంలో భాగంగానే ఈ చర్య తీసుకున్నట్లు చెప్పారు. అయితే దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని రైతు నాయకులు తెలిపారు.

శంభు సరిహద్దు వద్ద రైతులపై మళ్లీ టియర్ గ్యాస్ ప్రయోగం

కేంద్రం చర్చలకు సిద్ధపడకపోవడంతో తిరిగి ప్రారంభించిన పంజాబ్ రైతుల ఢిల్లీ మార్చ్‌ను హర్యానా పోలీసులు శంభు సరిహద్దు వద్ద మరోసారి అడ్డుకున్నారు. ఫిబ్రవరి నుంచి కాంక్రీట్ కంచె వేసి కేంద్ర బలగాలను మోహరించి ఆ ప్రాంతంలో మకాం వేసిన రైతులను

రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు

పోలీసులు ఎదుర్కొన్నారు. యుద్ధ వాతావరణం నెలకొనడంతో రైతులు తమ పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి కార్యాచరణను సోమవారం నిర్ణయిస్తామని నేతలు తెలిపారు. శుక్రవారం నాటికి 101 మందితో కూడిన బృందం ఆదివారం కాలినడకన సాగింది. అనుమతి లేని కారణంగా పాదయాత్ర చేయలేరని పోలీసులు హెచ్చరించారు. మీరు రైతులని రుజువు ఉందా? అని అడగడంతో వాగ్వాదానికి దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అదే స్థాయిలో కొనసాగడంతో పాదయాత్రను నిలిపివేశారు. 10 మంది గాయపడ్డారని, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పాండర్ తెలిపారు. సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు.

కాగా, ఖనోరీ సరిహద్దులో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఆదివారం నాటికి 13 రోజులు పూర్తయింది. రైతులు సమ్మె తీవ్రతరం చేయడంతో ఖనోరి, శంభు ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శంభులో నిషేధ ఉత్తర్వులు ప్రకటించారు. ఆ ప్రాంతంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిషేధించబడ్డాయి. ఢిల్లీ సరిహద్దుల్లో కూడా భద్రతను పెంచారు. రైతుల డిమాండ్లలో రుణ మాఫీ, మద్దతు ధరలకు చట్టపరమైన హామీ వంటి ఉన్నాయి.

కాశ్మీర్‌లో అనుమానాస్పద స్థితిలో ఇద్దరు పోలీసుల మృతి

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో ఉధంపూర్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున పోలీస్ వ్యాన్‌లో ఇద్దరు పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంటడం సంచలనంగా మారింది. మృతుల శరీరాలపై బుల్లెట్ గాయాలు ఉన్నాయి. ఉత్తరకాశ్మీర్‌లోని సోపోర్ నుంచి రియాసి జిల్లాలోని ట్రైనింగ్ సెంటర్ (ఎస్‌టీసీ) తల్వారాకు ప్రయాణిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే.. దుండగులు వారిపై దాడికి పాల్పడ్డారా..? లేదా వారే ఒకరినొకరు కాల్చుకున్నారా..? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. 'ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఉధంపూర్‌లోని కాళీమాత దేవాలయం సమీపంలో పోలీసు వ్యాన్‌లో బుల్లెట్ గాయాలతో, అనుమానాస్పద స్థితిలో ఇద్దరు పోలీసుల మృతదేహాలను గుర్తించాం. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించాం' అని పోలీసులు అధికారులు పేర్కొన్నారు. విచారణ ప్రారంభించామని చెప్పారు.

బిజెపి విధానాలతో ఇబ్బందుల్లోకి దేశం : శశి థరూర్

న్యూఢిల్లీ: బిజెపి విధానాలతో భారత దేశం ఇబ్బందుల్లోకి వెళుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శశి థరూర్ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి, వ్యాపారవేత్త గౌతమ్ అదానీని లక్ష్యంగా చేసుకుంటూ భారత్‌ను అస్థిరపరచడానికి అమెరికా ప్రయత్నిస్తోందని బిజెపి చేస్తున్న ఆరోపణలను ఖండించారు. అమెరికాపై బిజెపి చేస్తున్న ఆరోపణలు ఆ పార్టీ నేతల కుటిల మనస్తత్వాలను తెలియజేస్తున్నాయని విమర్శించారు. ఇటువంటి ప్రవర్తన భారత్‌కు ఇబ్బందికరంగా మారొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'కమలం పార్టీకి ప్రజాస్వామ్యం, దౌత్యం అంటే ఏమిటో అర్థం కావడం లేదని స్పష్టమవుతోంది. చిల్లర రాజకీయాల్లో వారు పూర్తిగా కూరుకుపోయారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను విస్మరించారు. ఇతర దేశాలతో సత్సంబంధాలను కొనసాగించే విధంగా ప్రవర్తించట్లేదు. వారి బాధ్యతలను విస్మరిస్తున్నారు. ముఖ్యమైన దేశాలతో బిజెపి అనుసరిస్తున్న ఇటువంటి ప్రవర్తన భారతదేశానికి ఇబ్బందికరంగా మారవచ్చు' అని శశి థరూర్ పేర్కొన్నారు.

సరిహద్దుల్లో త్వరలో యాంటీ డ్రోన్ యూనిట్ : అమిత్ షా

జోధ్‌పూర్ : దేశ సరిహద్దుల్లో త్వరలో యాంటీ డ్రోన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లో ఆదివారం బిఎస్‌ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా బలగాలను ఉద్దేశించి ప్రసంగించారు. సరిహదుల్లో ముఖ్యంగా పాకిస్థాన్‌తో నియంత్రణ రేఖ వెంబడి ప్రాంతాల్లో డ్రోన్ల అనుమానాస్పద కదలికలు భద్రతాబలగాలకు సవాల్ విసురుతున్నాయని, ఈ క్రమంలోనే సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర యాంటీ-డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అమిత్ షా ప్రకటించారు. లేజర్‌తో కూడిన యాంటీ-డ్రోన్ గన్-మౌంటెడ్ మెకానిజం ప్రాథమిక ఫలితాలు సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. దీనిద్వారా పంజాబ్‌లో భారత్- పాక్ సరిహద్దులో ప్రత్యర్థి డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతల కేసులు 3 శాతం నుండి 55 శాతానికి పెరిగాయని వెల్లడించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్‌బార్

- 300 కిలోల బంగారు కడ్డీ తయారీ
- గిన్నిస్ బుక్‌లో చోటు

దుబాయ్ : ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు కడ్డీ (గోల్డ్ బార్)ని దుబాయిలో ఆవిష్కరించారు. 300.12 కిలోల బరువు ఉన్న ఈ కడ్డీ ధర రూ.211 కోట్లుగా తయారీదారులు పేర్కొన్నారు. ఎమిరేట్స్ మింటింగ్ ఫ్యాక్టరీ ఎల్‌ఎల్‌సి తయారు చేసిన ఈ గోల్డ్‌బార్‌ను దుబాయి సౌక్స్ టెన్షన్‌లో శనివారం ప్రదర్శించారు. ప్రపంచంలోనే అత్యధిక బరువున్న బంగారు కడ్డీగా ఈ గోల్డ్ బార్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. గతంలో అత్యధిక బరువున్న (250కిలోలు) బంగారు కడ్డీని తయారు చేసిన రికార్డు జపాన్ పేరిట ఉండేది. తాజాగా 300 కిలోల గోల్డ్ బార్‌ను తయారుచేసి దుబాయ్ ఆ రికార్డును బద్దలుకొట్టింది. స్వచ్ఛమైన బంగారంతో ఈ భారీ కడ్డీని తయారు చేయడానికి దాదాపు పది గంటల సమయం పట్టిందని ఎమిరేట్స్ మింటింగ్ ఫ్యాక్టరీ ఎల్‌ఎల్‌సి డిప్యూటీ జనరల్ మేనేజర్ మహమ్మద్ ఖర్సా తెలిపారు. '300 కిలోల గోల్డ్ బార్‌ను తయారు చేయడానికి 8-10 గంటల సమయం పట్టింది. బంగారు కడ్డీని నిర్ణీత ప్రమాణాల ప్రకారం తయారు చేశాం. మేము తయారు చేసింది 300 కిలోల బంగారు కడ్డీ అని నిర్ధరించుకోవడానికి ప్రతిదీ కచ్చితంగా డాక్యుమెంట్ చేశాం. వాటినే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపించాం. బంగారు కడ్డీ విలువ సుమారు 25 మిలియన్ డాలర్లు (93 మిలియన్ యుఎఇ దిర్హామ్‌లు ఉటుంది)' అని ఖర్సా తెలిపారు.

అభివృద్ధి పేరిట పర్యావరణానికి తూట్లు

- అటవీ భూములకు సత్వర అనుమతులు
- రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ : అభివృద్ధి పేరుతో కేంద్రంలోని పాలకులు పచ్చటి పర్యావరణాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో రెడీఅయిపోతున్నారు. అటవీ సంపదను దోచుకునేలా తమ వారు అనుకున్న పెద్దలకు అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. తాజాగా మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల స్వాధీనానికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. అటవీ భూములకు అనుమతులు మంజూరు చేయడానికి చాలా సమయం పడుతోందని, దీనిని తగ్గించాలని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, అటవీ శాఖకు చెందిన చీఫ్ కన్సర్వేటివ్‌లకు పంపిన కార్యాలయ మెమోరాండంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సూచించింది. 2023వ సంవత్సరపు వన సంరక్షణ ఎవమ్ సంవర్ధన నిబంధనల్లో నిర్దేశించిన గడువును పరిగణనలోకి తీసుకోని అధికారులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేయాలని ఆ నోటీసులో ఆదేశించింది.

అటవీ భూముల్లో చేపట్టే ప్రాజెక్టుల విషయంలో అనుసరించాల్సిన ప్రక్రియను, నిర్దేశించుకోవాల్సిన కాలపరిమితిని ఆ నిబంధనలు నోటిఫై చేశాయి. అనుమతుల మంజూరు ప్రక్రియకు ఎంత సమయం పడుతోందన్న విషయంపై సమీక్ష జరిపామని మంత్రిత్వ శాఖ తెలిపింది. వన సంరక్షణ ఎవమ్ సంవర్ధన్ అధినియంలో నిర్దేశించిన కాలపరిమితికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులు కట్టుబడి ఉండడం లేదని చెప్పింది. పలు సందర్భాల్లో నిర్దేశించిన దాని కంటే రెట్టింపు సమయం తీసుకుంటున్నారని ప్రస్తావించింది. అయితే ఈ జాప్యానికి కారణాలేమిటో ఆ అధికారులు వివరించలేదని తెలిపింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నానని అంటూ నిబంధనలకు ప్రాసెసింగ్ అధికారులు కట్టుబడి ఉండేలా చూడాల్సిన అవసరం ఉన్నదని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది.

ఎన్నికల ప్రక్రియపై అనుమానాలున్నాయి: శరద్ పవార్

ముంబయి: మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌సిపి) అధ్యక్షులు శరద్ పవార్ వ్యాఖ్యానించారు. షోలాపూర్ జిల్లాలోని మర్కద్వాడి గ్రామంలో యాంటి- ఇవిఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలున్నాయి. ఇవిఎంలపై ప్రజల్లో విశ్వాసం లేదు. అయినా.. ఓటు వేశారు. అమెరికా, ఇంగ్లండ్‌తో సహా ప్రపంచమంతా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తోంది. భారత్‌లో మాత్రమే ఇవిఎంలు ఎందుకు? ఇక్కడి ప్రజలు బ్యాలెట్‌లతోనే ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు" అని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై స్థానిక ప్రజల్లో ఎలాంటి ఫిర్యాదులున్నా తనకు అందజేయాలని వాటిని ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపిస్తానని శరద్ పవార్ తెలిపారు.

దక్షిణ కొరియా మాజీ రక్షణ మంత్రి అరెస్ట్

సియోల్ : దక్షిణ కొరియాను గందరగోళంలోకి నెట్టిన మార్షల్ లా విధింపులో కీలక పాత్రధారుల్లో ఒకరైన రక్షణ శాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌ను అరెస్ట్ చేసినట్లు స్థానిక మీడియా ఆదివారం తెలిపింది. సైనిక పాలన యత్నం విఫలమైన తరువాత రక్షణ మంత్రిగా యోంగ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. పార్లమెంటులో అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానానికి మూడింట రెండొంతుల మెజార్టీ లభించనందున అది ఆటోమేటిక్‌గా రద్దయింది. ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే రక్షణ శాఖ మాజీ మంత్రి అరెస్టు కావడం గమనార్హం.ఆయన ఇతర దేశాలకు పారిపోకుండా ప్రయాణాలపై నిషేధం విధించింది. అధ్యక్షుడు యూన్, మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ సహా ఇతరులపై తిరుగుబాటు ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కిమ్‌యోంగ్ అరెస్ట్‌పై అధికార యంత్రాంగం స్పందించాల్సి వుంది.

మరో సర్దుపోటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం గత రాష్ట్రప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. దీంతో ప్రతి నెల కూడా ఎపిఇఆర్‌సికి చెప్పకుండానే ఎవరికీ తెలియకుండానే యూనిట్‌కు 40 పైసలు వసూలు చేస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా అదనంగా విద్యుత్ చార్జీల భారాన్ని మోపబోమని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా ఐదు నెలల కాలంలోనే రూ.15,484కోట్ల భారాన్ని మోపింది. ఇది గత వైసిపి చేసిన పాపంగా ప్రభుత్వం చెబుతోంది. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెల బిల్లు నుంచి 2024-25 ఎఫ్‌పిపిసిఎ కింద వసూలు చేస్తున్న యూనిట్‌కు 40 పైసలు గురించి ప్రస్తావించడం లేదు. భారాలు మోపబోమని చెప్పి వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్న ఎఫ్‌పిపిసిఎ భారాన్ని రద్దు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే యూనిట్‌కు 40 పైసలు చొప్పున వసూలు చేసిన భారం కాకుండానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ వినియోగదారుల నుంచి ఎంత వసూలు చేయాలో డిస్కమ్‌లు లెక్కలు తేల్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు ఎపిఇఆర్‌సికి ప్రతిపాదనలు పంపించనున్నాయి. భారాలు మోపబోమని చెబుతున్న ప్రభుత్వం ఈ ఎఫ్‌పిపిసిఎ చార్జీల భారాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని వినియోగదారులు, విద్యుత్ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

కొసరే భారం

వినియోగదారుల నుంచి డిస్కమ్‌లు నాలుగు చార్జీలను ఇప్పటికే వసూలు చేస్తున్నాయి. జనవరిలో వినియోగదారులకు అందించే బిల్లులో 2014-19 ట్రూఅప్, 2022-23, 2023-24 ఎఫ్‌పిపిసిఎ భారాలతో పాటు ప్రతి నెల వసూలు చేసే 40పైసలు కూడా అదనం. అసలు బిల్లు కాకుండా చార్జీల రూపంలోనే వినియోగదారులు యూనిట్‌కు సుమారు రూ.1.70లు చెల్లించాలి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) ఎఫ్‌పిపిసిఎ చార్జీలకు కూడా ఎపిఇఆర్‌సి అనుమతి ఇస్తే యూనిట్ ధర రూ.2లు దాటి అసలు కంటే కొసరే భారమనట్లుగా పరిస్థితి తయారవుతోంది.

సిరియాలో తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక మిలీషియా గ్రూపులతో కూడిన కూటమి వారం రోజుల తిరుగుబాటులో కీలకమైన నగరాలను ఒకటి తరువాత ఒకటి ఆక్రమిస్తూ చివరి దుర్గమైన డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్ ప్రభుత్వం పతనమైంది. తిరుగుబాటు నాయకుడు అబూ మహ్మద్ అల్ జొలాని నేతృత్వంలోని హయత్ తెహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) ఒక ప్రకటన చేస్తూ 'ఈ రోజుతో ఒక చీకటి శకం ముగిసింది. కొత్త శకానికి నాంది పలుకుతున్నాం' అని పేర్కొంది. సిరియాలో చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలపై రష్యా, ఇరాన్, ఇరాక్ తదితర పశ్చిమాసియా దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ తదితర దేశాలు దీనిని స్వాగతించాయి.

సిరియాలోని డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ప్రభుత్వ ప్రసార కేంద్రాలతో సహా కీలకమైన కేంద్రాలను వశపరచుకున్న తర్వాత తిరుగుబాటు దళ కమాండర్ అహ్మద్ అల్ షరా మొదటిసారి జాతి నుద్దేశించి టెలివిజన్‌లో ప్రసంగిస్తూ, ప్రభుత్వ సంస్థలు వేటితోను మిలిటరీ అప్రోచ్ కాకూడదని హుకుం జారీ చేశారు. అధికారికంగా అధికార మార్పిడి జరిగేంతవరకు మాజీ ప్రధాని మహ్మద్ అల్ జలాలీ ఆధ్వర్యంలోనే పరిపాలన ఉంటుందని చెప్పారు. అయిదు దశాబ్దాల బాత్ పార్టీ నిరంకుశ పాలనకు నేటితో తెర పడిందన్నారు. మరో వైపు ప్రధాని మహ్మద్ అల్ జలాలి మాట్లాడుతూ, అధికార బదలాయింపు సాఫీగా సాగేందుకు తాను సహకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ఏ నాయకత్వంఈతోనైనా కలిసి పనిచేయడానికి తాను సుముఖంగా ఉన్నానన్నారు. సిరియాలో 'అసాధారణ పరిణామాలను' అమెరికా అధ్యక్షుడు జో బెడెన్ నిశితంగా పరిశీలిస్తున్నారని' వైట్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు అల్‌అసద్ కుటుంబం అయిదు దశాబ్దాలకు పైగా సిరియాను పాలిస్తూ వచ్చింది. 2000లో తన తండ్రి హఫీజ్ అసద్ మరణం తర్వాత అల్ అసద్ అధికారం చేపట్టారు.

. సిరియాలో అతి ప్రాచీన నగరమైన పల్మీరా, హామ్. అలెప్పో నగరాలను వశపరచుకున్న తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను అన్ని వైపుల నుంచి ఆదివారం చుట్టుముట్టారు. పెద్దగా ప్రతిఘటన లేకుండానే డమాస్కస్ తిరుగుబాటుదారుల వశమైంది. దీంతో రాజధానిలోని మెయిన్‌స్క్వేర్‌లో తిరుగుబాటు దారులు సంబరాలు చేసుకున్నారు. డమాస్కస్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయాన్ని తిరుగుబాటు దారులు ధ్వంసం చేశారు. అంతకుముందు సైద్నాయ సైనిక జైలుపై దాడి చేసి అక్కడ ఉన్న ఖైదీనలందరినీ విడుదలజేశారు. 'దీంతో క్రూరమైన నిర్బంధం నుంచి మా ఖైదీలకు విముక్తి లభించిందని' తిరుగుబాటు దళ నాయకుడొకరు వ్యాక్యానించారు. 2011లో మొదటి సారి అసద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. అప్పటి నుంచి అమెరికా దన్నుతో జిహాదిస్టులు, స్థానిక మిలీషియా గ్రూపులు ప్రభుత్వ దళాలతో ఘర్షణలకు దిగుతూ సిరియాను అంతర్యుద్ధంలోకి నెట్టాయి. ఈ అంతర్యుద్ధంలో దాదాపు మూడున్నర లక్షల మందికిపైగా చనిపోయినట్లు ఐరాస నివేదికలు పేర్కొంటున్నాయి.

ట్యాంక్‌బండ్‌పై ఎయిర్ షో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఆదివారం నిర్వహించిన ఎయిర్ షో ఆకట్టుకుంది. సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిగా హాజరై ఎయిర్ షోను ప్రారంభించారు. భారతీయ వాయుసేన గ్రూప్ కెప్టెన్ అజయ్ దశరథి నేతృత్వంలో సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీం తేజస్ విమానాలతో గంట సేపు చేసిన విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. గంటకు 800 కిలోమీటర్ల వేగంతో తక్కువ ఎత్తులో రయ్‌మని దూసుకుపోతూ ఆకాశంలో పల్టీలు కొట్టడం, యూత్‌కి సింబాలిక్‌గా వై ఆకారంలో ఫార్మేషన్, ప్రేమకు గుర్తుగా లవ్ సింబల్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ ఫార్మేషన్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ షోను తిలకించేందుకు హైదరాబాద్ నగరవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సిఎంతో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఎయిర్ షోను వీక్షించారు.

ఎవరీ అల్ జొలాని?

డమాస్కస్ : సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని తిరుగుబాటుద్వారా కూల్చివేసి అధికారం చేజిక్కించుకున్న ఇస్లామిక్ అలయెన్స్ నాయకుడు 45 ఏళ్ల అబూ మహ్మద్ జొలాని వార్తల్లో వ్యక్తి అయ్యాడు. అసలు ఎవరీ జోలానీ? ఏమిటి ఈయన నేపథ్యం? వంటి ప్రశ్నలు తలెత్తడం సహజం. జొలాని 1982లో సిరియా రాజధాని డమాస్కస్‌కు సమీపంలోని మజె పట్టణంలోజన్మించాడు. వీరి మూలాలు పాలస్తీనాలో ఉన్నాయి. 1967లో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ పూరిత యుద్ధం సాగించినప్పుడు వీరి తాత పాలస్తీనాలోని గొలాన్ హైట్స్ నుంచి శరణార్థిగా సిరియాకు బలవంతంగా తరలించబడ్డారు. మొదట జిహాదిస్టుగా ఆరంభమైన జొలాని జీవితం అనేక మలుపులు తిరిగింది. ఈ తిరుగుబాటు నాయకుడి మూలాలు ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ అల్‌ఖైదాలో ఉన్నాయి. మొదట అల్‌ఖైదాలో చేరాడు. అయిదేళ్ల పాటు నిర్బంధంలో ఉన్నాడు. ఇరాక్‌లో జిహాదిస్టుగా తర్ఫీదు పొందాడు. 2001 సెప్టెంబరు 11 దాడుల తర్వాత అమెరికా ఇరాక్‌పై దాడి చేసినప్పుడు అతను ఆ దేశం వీడి స్వదేశమైన సిరియాకు తిరిగి వచ్చి అల్‌ఖైదా సిరియా శాఖగా హయత్ తెహ్రిర్ అల్‌షామ్ (హెచ్‌టిఎస్)ను ను స్థాపించి ఉగ్రవాద కార్యకలాపాలు సాగించాడు. 2011 మార్చిలో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదటిసారి తలెత్తిన తిరుగుబాటులో పాల్గొన్నాడు. అమెరికా, ఇజ్రాయిల్ ఇతర పశ్చిమ దేశాల అండతో సిరియాలో ఇస్లామిస్ట్ తీవ్రవాద గ్రూపులను, స్థానిక మిలీషియాలను కలుపుకుని ఇస్లామిక్ అలయెన్స్ (దీనినే అల్ నుస్రా ఫ్రంట్) ను ఏర్పాటు చేశాడు. 2013లో అల్‌ఖైదా నుంచి చీలి ఐసిస్‌ను అబు బకర్ ఏర్పాటు చేసినప్పుడు దానిలో చేరేందుకు జొలాని తిరస్కరించి, అల్‌ఖైదాపట్ల తన విధేయతను చాటుకున్నాడు. అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని సాయుధ, తీవ్రవాద గ్రూపులను కలుపుకుని పశ్చిమ దేశాల అండతో అసద్ ప్రభుత్వాన్ని కూలదోశాడు.

Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 18003000825
Email ID: loanfirst@homefirstindia.com

వ్యక్తిగత వస్తువులను తొలగించుటకు ప్రకటన

టు,

1) పెయ్యాల అనూష (ప్రధాన రుణగ్రహీత), 5-89, తమిరిషా, నందివాడ మండలం, గుడివాడ, ఆంధ్రప్రదేశ్-521327, ఇండియా

2) పెయ్యాల జోసఫ్ తంబి (సహ-రుణగ్రహీత), 5-89, తమిరిషా, నందివాడ మండలం, గుడివాడ, ఆంధ్రప్రదేశ్-521327, ఇండియా.

తేది.03-08-2024 నాటి డిమాండ్ నోటీసు ప్రకారం, రుణగ్రహీతలు **పెయ్యాల అనూష, పెయ్యాల జోసఫ్ తంబి** వారు మొత్తం **రూ.6,32,116/- (రూపాయలు ఆరులక్షల ముప్పైరెండువేల ఒకవంద పదహారు మాత్రమే)**లను తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు, ఆ విధంగా, అధీకృత అధికారి పేర్కొన్న రూల్స్‌లోని 8 & 9 నిబంధనలతో చదవబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **10.10.2024**న స్వాధీనం చేసుకున్నారు.

పేర్కొన్న ఆస్తిలో వస్తువులు/ చరాస్తులు/ వ్యక్తిగత ఆస్తులు ఉన్నాయని మరియు ఈ నోటీసు తేదీ నుండి 7 రోజులలోపు వాటిని తీసివేయాలని ఇందుమూలంగా తెలియజేయబడింది. పేర్కొన్న వస్తువులు ఆస్తి నుండి తీసివేయబడకపోతే, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి వాటిని విక్రయించబడును/ తీసివేయబడును. చట్టానికి లోబడి ఆస్తిని నిల్వ చేయడం వల్ల కలిగే నష్టానికి హోమ్ ఫస్ట్ బాధ్యత వహించదు, దాని ఖర్చు మరియు పర్యవసానానికి మీరు మాత్రమే బాధ్యత వహించాలి.

మీరు తప్పనిసరిగా **అధీకృత అధికారి (భార్గవ్ రామ్ దోనేపూడి-9346543553)** వారిని సంప్రదించాలని మరియు ఈ నోటీసు తేదీ నుండి ఏడు రోజుల లోపు దిగువ పేర్కొన్న ఆస్తి నుండి మీ వ్యక్తిగత వస్తువులను తీసివేయడానికి ఏర్పాటు చేసుకోవాలని మీకు ఇందుమూలంగా తెలియజేయబడింది.

మీ నుండి తాజా బకాయిలను రికవరీ చేయడానికి హోమ్ ఫస్ట్ హక్కులకు ఎటువంటి దురభిప్రాయం లేకుండా ఈ పబ్లిక్ నోటీసు జారీ చేయబడింది.

స్థిరాస్తి వివరణ:

డోర్ నెం:5-84, అనూష, ఆర్‌ఎస్ నెం.420, డోర్ నెం: 5-84, తమిరిస, నందివాడ గ్రామం, గుడివాడ, ఆంధ్రప్రదేశ్, 521327 సరిహద్దులు: ఉత్తరం: వాకళ్లగడ సుజాతకు చెందిన ఆస్తి, దక్షిణం: గూడవల్లి అరుణకు చెందిన ఆస్తి, తూర్పు: రోడ్డు, పడమర: పెయ్యాల సౌరిబాబుకు చెందిన ఆస్తి.

తేది: 09-12-2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 18003000825
Email ID: loanfirst@homefirstindia.com

వ్యక్తిగత వస్తువులను తొలగించుటకు ప్రకటన

టు,

1) నల్లూరి సుజాత (ప్రధాన రుణగ్రహీత), ఫ్లాట్ నెం.402, [illegible] విజయవాడ, ఆంధ్రప్రదేశ్ 520007, ఇండియా.

2) నల్లూరి రవితేజ (సహ-రుణగ్రహీత), [illegible] ఆంధ్రప్రదేశ్-522001, ఇండియా.

[illegible]

స్థిరాస్తి వివరణ:

కానూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, పెనమలూరు మండలం, ఎస్‌ఆర్‌ఓ పటమట, కృష్ణా జిల్లా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520007లోని ఆర్‌ఎస్ నెం.5/3, ప్లాట్ నెం.9 (డోర్ నెం.18-41 దగ్గర)లోని 40చ.అ.ల స్కూటర్ పార్కింగ్, 100చ.అ.ల కామన్, 1100చ.అ.ల ప్లింత్ ఏరియాతో 3వ అంతస్తు, ఫ్లాట్ నెం.402. సరిహద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.8:62', దక్షిణం: ఫ్లాట్ నెం.2:40', పశ్చిమం: ఫ్లాట్ నెం.10: 62', ఉత్తరం: 33 అ.ల వెడల్పు పంచాయితీ రోడ్డు-40'

తేది: 09-12-2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 18003000825
Email ID: loanfirst@homefirstindia.com

DEMAND NOTICE

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలైన మీరు షెడ్యూలులో పేర్కొన్న ఆస్తి తాకట్టు ద్వారా రుణం పొందియున్నారు మరియు రుణ ఒప్పందం కొరకు రుణగ్రహీత/సహ-రుణగ్రహీతగా దిగువ పేర్కొన్న మీరు వున్నారు. మీరు చెల్లించుటలో డిఫాల్టి చెందియున్నారు, దీ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సర్ఫేసి యాక్ట్) యొక్క నియమాల క్రింద, మీ రుణ ఖాతా **03.12.2024**న నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మేము హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ మీచే చూపిన చిరునామాలకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(13) తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నో టీసును జారీచేశాము. సదరు నోటీసు **03.12.2024**న జారీచేయబడినది మరియు అట్టి నోటీసులో పేర్కొన్నది ఏమనగా మీకు మంజూరైన వివిధ రుణాలను తిరిగిచెల్లించుటలో మీరు డిఫాల్టి చెందారని వుంది. కావున ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)కు నియమాలలో సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) యొక్క నియమాల ప్రకారం ప్రస్తుత ప్రకటన ద్వారా మీకు నోటీసు ఇవ్వబడుచున్నది.

క్ర. సం.	ఖాతా, రుణగ్రహీత(ల) & హామీదారు(ల) పేరు & చిరునామా	స్వాధీనం చేసుకొను సెక్యూరిటీ వివరాలు	డిమాండ్ నోటీసు తేది నాటికి పూర్తి బకాయి ప్లస్ తదుపరి వడ్డీ & ఇతర వ్యయాలు (రూ.లలో)
1	పులివర్తి కిరణ్ కుమార్, పులివర్తి భువనేశ్వర రావు, పులివర్తి కనకరత్నం	డి.నెం.169/బి, తెనాలి వెస్ట్ సబ్ రిజిస్ట్రార్, తెనాలి గ్రామ పంచహాయతి, డి.నెం.169/బి, బ్లాక్ నెం.4, వలివేరు డోర్ నెం.4-82 దగ్గర (పన్ను తలుపు నెం.4-81, అసెస్ట్ నెం.503 ప్రకారం), గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522211. **సరిహద్దులు: ఉత్తరం:** పులివర్తి యేసుపాదంకు చెందిన ఆస్తి-78 లింకులు, **దక్షిణం:** యల్లమాటి జయశ్రీకుచెందిన ఆస్తి-78 లింకులు, **తూర్పు:** పి.డబ్ల్యు.డి.కాలువ కట్ట-38 లింకులు, **పడమర:** 20 లింకుల వెడల్పు పంచాయతీ పాత్‌వే-38 లింక్‌లు.	Rs. 1,079,992
2	పారుపల్లి జ్యోతిబాబు, పారుపల్లి సబేరా	డోర్ నెం:4-8, డి నెం:38, అసెస్ట్ నెం:403, ఎల్.పి నెం.345, పీసపాడు గ్రామ పంచాయితీ ప్రాంతం, క్రోసూర్ మండలం, పెదకూరపాడు సబ్ డిస్ట్రిక్ట్ యిలక, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పల్నాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522410. **సరిహద్దులు : తూర్పు:** పంచాయతీ బజార్-38', **దక్షిణం :** పారుపల్లి ప్రసాదరావు ఆస్తి-35', **పడమర :** పారుపల్లి త్రిదాసు ఆస్తి-38', **ఉత్తరం :** పంచాయతీ బజార్-35'.	Rs. 617,957

పై పేర్కొన్న మొత్తాలను వడ్డీ& ఖర్చులతో ఈనోటీసు ప్రచురణ తేది నుండి 5196 (పాతది), న్యూ మున్సిపల్ నెం.17-2-180, విస్తీర్ణం 300చ.గ.లు, చవాని నది అలీ బేగ్, హైదరాబాద్, తెలంగాణ-500023 నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు చెల్లించవలసిందిగా ఇందుమూలంగా మిమ్మలను కోరబడుచున్నది, లేనిచో, ఏదైతే, రుణగ్రహీతలు, తాకట్టుదారులు మరియు హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసు కొనుటతోసహా సెక్యూర్డ్ అసెట్స్ అన్ని లేదా ఏదేని ఒకటి లేదా మరిన్ని పై సదరు చట్టం యొక్క నియమాల క్రింద అవసరమైన చర్యను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** తీసుకొంటుంది. దిగువ వాటితోపాటు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు అందుబాటులోగల అధికారాలు: (1) సెక్యూర్డ్ అసెట్స్‌రియలైజింగ్ కొరకు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు అధికారలతో సహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొంటుంది (2) సెక్యూర్డ్ అసెట్స్ రియలైజింగ్ మరియులీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు అధికారాలతోసహా సెక్యూర్డ్ అసెట్స్ నిర్వహణ మరియు మీచే బదిలీచేయబడినట్లైతే బదిలీచేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ రియలైజేషన్ మరియు అన్ని హక్కుల్లో రద్దుఅవుతాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) యొక్క నియమాలలో, మీరు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** యొక్క ముందస్తు అనుమతి లేకుండా హోమ్ ఫైస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్‌కు హైపోథికేటెడ్/ తాకట్టుచేసిన మరియు పై పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్ ఏదేనినైనా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలు (మీ వ్యాపారంకు ఇతరత్రా)గా కాని బదిలీచేయుట నుండి మీరు నిషేదింపబడినారు.

ప్రదేశం : గుంటూరు
తేది : 09-12-2024

సం/- అధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

మీకోసం

సగం కోసిన ఉల్లిపాయ ముక్కకు వెన్న రాసి ఉంచితే తాజాగా ఉంటుంది.

జీవన సౌరభం

ఆశయం లేని జీవితం, దీపం లేని ఇల్లు వంటిది.

JEEVANA జీవన the family

చెరువు



చెరువును నేను
పల్లె చెరువును నేను
పల్లెలతో అల్లుకున్న బంధం నేను

పల్లె ప్రజల జీవన
రథ సారథి నేను
జన జీవన చైతన్యపు
వారధి నేను

ప్రజలందరి అవసరాలు
తీర్చేస్తాను
పాడి పశువులకు
తాగు నీరిస్తాను

పక్షులనెంతో ప్రేమతో
లాలిస్తాను
పంట పొలాలకు
నీటిని అందిస్తాను

రైతుకు చేయూతనిచ్చి
ఆదుకుంటాను
చేపల ఉత్పత్తి కొరకు
తోడ్పడుతాను

భూగర్భ జలాలను
చక్కగ పెంచేస్తాను
బోరు బావులను
నిండుగ నింపేస్తాను

ప్రకృతిలో దృశ్యమునై
పరవశింపజేస్తాను
పల్లెటూరి సంస్కృతి ప్రతిబింబం
నేను
చెరువును నేను
పల్లె చెరువును నేను...

- నాగరాజు కామర్సు,
92480 93580.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ

ఎం.డి.షోయబ్ అలీ,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతారెడ్డిపేట,
సిద్ధిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వెచ్చదనాన్నిచ్చే దుప్పట్లు...

చలికాలం.. అందులోనూ రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. చలి వాతావరణం నానాటికీ పెరిగిపోతోంది. ఈ క్రమంలో శరీరానికి వెచ్చదనాన్నిచ్చే దుస్తులపైన అందరూ దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఎక్కడ చూసినా చలిదుస్తులకు బాగా గిరాకీ కనిపిస్తోంది. బయటకు వెళ్తే శరీరానికి రక్షణ నిచ్చే స్వెట్టర్లు నుంచి తలకు టోపీ, మొఫ్లర్, మంకీక్యాప్, చెవులకు గాలి తగులకుండా ఇయర్ మఫ్స్‌తో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. అంతేకాకుండా పడుకునేందుకు మంచి దుప్పట్లు కూడా వినియోగిస్తే చలి నుంచి వెచ్చదనాన్ని అందిస్తూ మంచి నిద్రను పొందగలం. అందుకే చలినుంచి కాపాడేందుకు ఈ కాలంలో దుస్తుల ఎంపిక ఎంతో ముఖ్యం. ఇప్పుడు మార్కెట్లో అనేక రకాలైన దుప్పట్లు ఇబ్బడిముబ్బడిగా వచ్చేశాయి.

శీతాకాలంలో వెచ్చని దుప్పటి కలిగివుండటం ఎంతో అవసరం. మంచి నాణ్యత కలిగిన దుప్పటి మన శరీరాన్ని చలి నుంచి కాపాడి వెచ్చగా మారుతుంది. మృదువైన, సౌకర్యవంతమైన దుప్పట్లు ప్రస్తుతం మార్కెట్లో విరివిగా అందుబాటులో ఉన్నాయి. ప్రయాణాల్లో కూడా మన వెంట వీటిని తీసుకెళ్లొచ్చు. డబుల్‌బెడ్, సింగిల్‌బెడ్‌లకు ఉపయోగించే దుప్పట్లు నేడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. తేలికపాటి దుప్పట్ల నుంచి బరువు ఉన్నవి కూడా రగ్గుల వరకూ ఈ కాలంలో చలి నుంచి కాపాడటానికి దోహదపడతాయి. బాగా చలిగా ఉన్నప్పుడు రెండు దుప్పట్లు కప్పుకోగానే క్షణాల్లో వెచ్చగా ఉంటుంది. మనం రెండు దళసరి దుప్పట్లు కప్పుకున్నప్పుడు వాటి మధ్య ఒక గాలి పొర ఇరుక్కుపోతుంది. ఇలాంటి గాలిపొర వేడిని తన గుండా అంత సులభంగా పోనివ్వదు. దాంతో మన ఒంట్లో వేడి అంత సులభంగా గాల్లోకి పోదు. అందువల్లే రెండు దుప్పట్లను కప్పుకున్నప్పుడు మనకు వెచ్చగా ఉంటుంది. మార్కెట్లో వివిధ కంపెనీలకు చెందిన దుప్పట్లు అందుబాటు ధరల్లో ఆకర్షణీయంగా ఉంటున్నాయి. చలి నుంచి రక్షణ పొందేందుకు మార్కెట్లో లభిస్తున్న కొన్ని దుప్పట్ల గురించి తెలుసుకుందాం.

ఎలక్ట్రిక్ బ్లాంకెట్స్ : అనేక రకాలైనవి మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. స్టైలిష్‌గా కూడా వీటిని తయారుచేశారు. కరెంట్ ఛార్జింగ్‌తోపాటుగా మాన్యువల్‌గా కూడా హీట్ కంట్రోల్‌తో ఇది అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన ఎలక్ట్రిక్ బ్లాంకెట్లను మాత్రమే ఎంచుకోవాలనీ, లేనిపక్షంలో షార్ట్ సర్క్యూట్‌తోపాటు హీట్ ఎక్కువైతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సాఫ్ట్, బెస్ట్ బ్యాంకెట్స్ : తేలికపాటి దుప్పట్లు సైతం కొన్ని ఈ సీజన్‌లో చలిని ఆపగలిగేవి ఉంటాయి. సాఫ్ట్ బ్యాంకెట్స్‌గా కూడా వీటిని పిలుస్తుంటారు. చాలా తక్కువ ధరల్లోనూ దొరుకుతుంటాయి. చాలా అందంగా ఉంటాయి. వెచ్చని అనుభూతిని అందిస్తాయి. ఎక్కువమంది మృదువైన, తేలికపాటి దుప్పట్లనే ఇష్టపడుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయాలనుకునే వారు ఈ దుప్పట్లను తీసుకెళ్తే చలినుంచి రక్షణకు దోహదపడతాయి.

పోరల్ ఫ్లీ సింగిల్ బెడ్ బ్యాంకెట్ : ఇది నాలుగు రంగుల సింగిల్ బెడ్ బ్యాంకెట్‌లతో కూడి గొప్ప కాంబో ప్యాక్. నాలుగు విభిన్న రంగులను కలిగివుంటుంది. స్వచ్ఛమైన ఉన్ని బట్టతో తయారుచేయబడింది. సింగిల్ బెడ్ బ్యాంకెట్ : ఇవి చాలా మృదువుగా ఉంటాయి. ఒక్కో దుప్పటి 400 గ్రాముల వరకూ ఉంటుంది. ఇళ్లల్లో చిన్న పిల్లలు ఉన్న వారికి సింగిల్ బెడ్ బ్యాంకెట్ ఉపయోగకరంగా ఉంటుంది.

సింగిల్ బెడ్ పోరల్ ఫ్లీ ఎసి బ్యాంకెట్ : ఇది పోరార్ ఫ్లీస్ సింగిల్ బెడ్ బ్లాంకెట్. ఎసి గదికి చాలా బాగుంటుంది. శీతాకాలంలో టీవీ చూసేటప్పుడు కూడా ఈ దుప్పటిని వినియోగించొచ్చు. ఇది చూడటానికి చాలా అందంగా ఉంటుంది.

లైట్ వెయిట్ సూపర్ సాఫ్ట్ లగ్జరీ త్రో బ్లాంకెట్ ఫర్ ది బెడ్ :
ఇది తేలికైన, చాలా వెచ్చని అనుభూతిని అందించే దుప్పటి. బ్యాంకెట్ ఫర్ బెడ్ ఫాబ్రిక్ పాలిస్టర్. ఇది చాలా మృధువైనది. ఇది ఎసి గదికి, సోఫాలో కూర్చుని టివి చూస్తున్నప్పుడు ఉపయోగించటానికి చాలా బాగుంటుంది. ఈ తేలికపాటి దుప్పటి పరిమాణం 90 అంగుళాల పొడవు, 78 అంగుళాల వెడల్పు ఉంటుంది. బ్యాంకెట్ ఫర్ బెడ్ ఒక వ్యక్తికి సరిపోతుంది.

సింగిల్ బెడ్ సైజ్ పోరల్ ఫ్లీ ఉలెన్ బ్యాంకెట్
ఇది ప్రీమియం క్వాలిటీ బ్లాంకెట్. దీనిని సిల్కీ, మృధువైన హెవీ డ్యూటీ ఫ్రాబ్రిక్ వెచ్చగా ఉంచుతుంది. మంచి నిద్రను అందిస్తుంది. ఉలెన్ బ్లాంకెట్ పొడవు 88 అంగుళాలు, వెడల్పు 58 అంగుళాలు. శీతాకాలంలో ఈ దుప్పటి వెచ్చదనాన్ని అందిస్తుంది. ప్రయాణ సమయంలోనూ ఆ ఉలెన్ బ్యాంకెట్‌ను ఉపయోగిస్తే చలి నుంచి రక్షణ వస్తుంది.

గ్లాసిఎల్ ఆల్ సీజన్ పోరల్ ఫ్లీ బ్లాంకెట్ : ఇది ఆల్ సీజన్ పోలార్ ఫ్లీస్ బ్లాంకెట్. దీనిలోని ఫాబ్రిక్ పాలిస్టర్ చాలా వెచ్చని అనుభూతిని అందిస్తుంది. దీనిని ఉపయోగిస్తున్నప్పుడు సౌకర్యవంతంగా ఉంటుంది. ఇది రెండు వైపుల నుంచి అల్లినదిగా ఉంటుంది. ఈ దుప్పటిని మెషిన్ వాష్ కూడా చేసుకోవచ్చు.

బెడ్ మీద వాడే దుప్పట్లు ...

ప్యానెల్ బ్యాంకెట్ : ఇది చూడటానికి చాలా అందమైన పసుపు రంగు దుప్పటి. ఇది 230 సెం.మీ.పొడవు, 200 సె.మీ.వెడల్పుతో చాలా మృదువుగా ఉంటుంది. సౌకర్యవంతమైంది. ఎసిలో కూడా ఉపయోగించొచ్చు. సింగిల్; డబుల్ బెడ్‌కు సరిపడేవి కూడా అనేక రంగుల్లో అందుబాటులో ఉన్నాయి.

స్టైయిలిష్ సింగిల్ బెడ్ బ్యాంకెట్ : ఇది ఒకే మంచానికి తగిన బ్రౌన్ కలర్ పోలార్ ఫ్లీస్ బ్యాంకెట్. దీని బరువు 400 గ్రాములు మాత్రమే. ఈ దుప్పటి ప్రయాణించేటప్పుడు తీసుకెళ్లటానికి కూడా అనుకూలంగా ఉంటుంది. వెచ్చదనంతో పాటుగా పూర్తి సౌకర్యాన్ని ఇస్తుంది. అసలు చలిపుట్టదు.

సోలిమో పోలార్ ఫ్లీస్ బ్లాంకెట్ : ఇది పోలార్ మెటీరియల్‌తో తయారుచేసిన నేవీ బ్లూ కలర్ సాఫ్ట్ బ్లాంకెట్. 100 శాతం పాలిస్టర్‌తో తయారుచేశారు. ఇది చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. దీని ఫాబ్రిక్ డబుల్ బ్రష్ చేయబడింది. ఇది చల్లని వాతావరణంలో మీకు చాలా వెచ్చదనాన్ని ఇస్తుంది. డబుల్ బెడ్‌కు సరిపడేలా నేడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

క్లాత్ ఫ్యూసిన్ మింక్ ఫ్యాబ్రిక్ డబుల్ బ్యాంకెట్ : ఈ డబుల్‌బెడ్ బ్లాంకెట్ చాక్లెట్ బ్రౌన్ కలర్‌లో ఉంటుంది. మొత్తగా ఉండటమే కాకుండా చలిని పోగొట్టి వెచ్చదనాన్ని ఇస్తుంది. ఈ దుప్పటిని పిల్లలు, పెద్దలు అందరూ ఉపయోగించొచ్చు.

వెయిటెడ్ కాటన్ బ్లాంకెట్ : కాటన్ మెటీరియల్‌తో తయారుచేశారు. ఈ వైట్ కలర్ బ్లాంకెట్ చూడటానికి చాలా సౌకర్యవంతంగా కనిపిస్తుంది. ఈ దుప్పటి తేలికగా ఉండటమే కాకుండా మంచి వెచ్చదనాన్ని కూడా ఇస్తుంది.

క్లాత్ ఫ్యూజిన్ గ్లాసికల్‌పోలార్ ఫ్లీస్ బ్లాంకెట్ : ఇది సింగిల్ బెడ్‌కు అనువైన చార్‌కోల్ బ్లాక్‌పేస్ బ్లాంకెట్. పాలిస్టర్ మెటీరియల్‌తో తయారుచేశారు. ఇది తేలికగాను వెచ్చగా ఉంటుంది.

ఉలెన్ బ్లాంకెట్ : చల్లటి వాతావరణంలో పూర్తి వెచ్చదనాన్ని ఇస్తుంది. ఇది ఒక మంచానికి అనుకూలంగా ఉంటుంది. ఉన్ని దుప్పటి కావటంతో ప్రయాణంలో కూడా తీసుకెళ్లొచ్చు.

'మెజార్టీ' కోరిక ప్రకారమే భారత్ నడుస్తుంది

- విహెచ్‌పి కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి వివాదస్పద వ్యాఖ్యలు

అలహాబాద్ : మెజార్టీ కోరిక ప్రకారమే భారత్ దేశం నడుస్తుందని అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలు చేయడం వివాదంగా మారింది. ఆదివారం అలహాబాద్ హైకోర్టు లైబ్రరీ హాల్ న్యాయవాదులు, విహెచ్‌పి వాలంటీర్లతో మాట్లాడుతూ జడ్జి ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది హిందూస్థాన్ అని చెప్పడానికి నాకు ఎలాంటి సందేహం లేదు. ఇది మెజార్టీ కోరిక ప్రకారమే నడుస్తుంది' అని అన్నారు. ముస్లింలు తమ సంస్కృతులు అనుసరించాలని హిందువులు కోరుకోరని, అయితే ముస్లింలు తమ దేవుళ్లని, సంస్కృతిని, గొప్పవారిని అవమానించకూడదనే హిందువులు కోరుకుంటున్నారని చెప్పారు. అలాగే, ముస్లిం పేరును ప్రస్తావించకుండా వారు హిందువుల జంతువులను చంపుతున్నప్పుడు వారి పిల్లలు దయ, సహనంతో ఎలా ఉంటారని ప్రశ్నించారు. 'మేం (హిందువులు) మా పిల్లలకు సహనం, దయ నేర్పుతాం. జంతువులు, ప్రకృతిని ప్రేమించడం నేర్పిస్తాం. కానీ మీకు అలా ఉండదు. మీ పిల్లల ముందే మా జంతువులను వధిస్తారు. దీంతో మీ పిల్లలు సహనం, దయ ఎలా నేర్చుకుంటారు' అని ప్రశ్నించారు. అలాగే, ఉమ్మడి పౌర స్మృతిని (యుసిసి) కూడా జడ్జి ఈ సమావేశంలో ప్రస్తావించారు. ముస్లింలు అనేక మంది భార్యలను కలిగిఉండటం, ట్రిపుల్ తలాక్, హలాలా ఇక చెల్లవని చెప్పారు. యుసిసిని సుప్రీంకోర్టు కూడా సమర్థిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ దినేష్ పాఠక్ కూడా పాల్గొన్నారు. అయితే ఆయన అక్కడ ప్రసంగించలేదు.

విహెచ్‌పి సభలో మాట్లాడుతున్న జస్టిస్ శేఖర్

కాగా, జడ్జి శేఖర్ కుమార్ యాదవ్ ప్రసంగం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పదవిలో ఉన్న ఒక జడ్జి విహెచ్‌పి కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వివాదాలు జడ్జి యాదవ్‌కు కొత్త కాదు. 2021లో 'ఆక్సిజన్‌ను పీల్చే, విడుదల చేసే ఏకైక జంతువు ఆవు'అని చెప్పడం ద్వారా వార్తల్లోకి వచ్చారు. ఆవును జాతీయ జంతువుగా మార్చాలని డిమాండ్ చేశారు.

సిరియా పరిణామాలపై వివిధ దేశాల స్పందనలు

డమాస్కస్: సిరియాలో తిరుగుబాటు ద్వారా అసద్ ప్రభుత్వం కూలిపోవడంపై అమెరికా, ఫ్రాన్స్, టర్కీ తదితర దేశాల నేతలు ఈ కింది విధంగా స్పందించారు.

- అనాగరిక రాజ్యం పతనమైంది. సిరియా ప్రజల ధైర్యం, సాహసం కొనియాడ దగింది.

- ఇమానియేల్ మాక్రాన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు

- సిరియాలో చోటుచేసుకున్న హఠాత్పరిణామం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. అక్కడ చోటుచేసుకున్న బాధాకరమైన, నాటకీయమైన పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తున్నాం. శాంతి, సుస్థిరత సాధ్యమైనంత త్వరలోనే తిరిగి ఏర్పడాలని కోరుకుంటున్నాం.

-చైనా విదేశాంగ శాఖ

- పశ్చిమాసియాలో ఇదో చారిత్రాత్మక రోజు. హిజ్బుల్లా, ఇరాన్‌లపై తాము జరిపిన దాడుల ప్రత్యక్ష ఫలితమే ఇది.

-ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు

- సిరియా భవిష్యత్తును ఆ దేశ ప్రజలే నిర్ణయించుకోవాలి. ఇందులో విదేశీ జోక్యం ఉండరాదు. అసద్ తరువాత కూడా సిరియాతో తమ సంబంధాలు ఎప్పటిలానే కొనసాగుతాయని ఆశిస్తున్నాం.

ఇరాన్ విదేశాంగ శాఖ

- అసాద్ ప్రభుత్వం కూలిపోయినందుకు ఎవరూ విచారించడం లేదు. తూర్పు సిరియాలో ఐసిస్‌ను శాశ్వతంగా ఓడించేదాకా అమెరికన్ దళాలు అక్కడ ఉంటాయి.

- అమెరికా పశ్చిమాసియా వ్యవహారాల (రక్షణ) శాఖ ఉప మంత్రి డేనియల్ షాపిరో

- అసాద్ దేశం వీడి పారిపోయాడు. అసాద్ రక్షకుడిగా ఉన్న రష్యా ఉక్రెయిన్‌పై దృష్టి పెట్టడం వల్ల అతనిపై ఆసక్తి కోల్పోయింది.

- అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్

- సిరియన్ ప్రజలు తమ సొంత దేశ భవిష్యత్తును రూపొందించుకునే దశకు సిరియా చేరుకుంది.

- హాకన్ ఫిదాన్, టర్కీ విదేశాంగ మంత్రి.

- సిరియా చరిత్రలో ఇదొక ముఖ్య ఘట్టం. దేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయం ముగిసింది. శాంతి, సయోధ్య, గౌరవం, సిరియన్ల భాగస్వామ్యంతో కూడిన కొత్త శకం ప్రారంభానికి ఆశతో ఎదురుచూస్తున్నాం.

- సిరియాలో యుఎన్ ప్రత్యేక ప్రతినిధి గిల్ పెడెర్సెన్

- సిరియా సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనాలని దోహాలో సమావేశమైన రష్యా, ఇరాన్, ఇరాక్, టర్కీ, సౌదీ అరేబియా, జోర్డాన్, ఈజిప్టు, ఖతార్ దేశాల ప్రతినిధులు సంయుక్తంగా విడుదలజేసిన ఒక ప్రకటనలో కోరారు.

'బీమా'పై కేంద్రం కత్తి

- 100 శాతం ఎఫ్‌డిఐకి కసరత్తు
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టే ప్రమాదం

న్యూఢిల్లీ : దేశ బీమా రంగంపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కత్తి వేలాడదీసింది. వాస్తవానికి కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ-2 పాలనలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ)ను అప్పటి ప్రతిపక్ష బిజెపి తీవ్రంగా వ్యతిరేకించింది. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి మాట మార్చేసింది. విదేశీ కార్పొరేట్ కంపెనీలకు జీహుజూర్ అంటే తలుపులు బార్లా తెరిచేసింది. ఈ క్రమంలోనే దేశ బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలకు దారులు తెరుస్తున్నది. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఈ మేరకు బిల్లు ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఇన్సూరెన్స్ చట్టం, 1938లోని పలు నిబంధనల సవరణకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిందని, ఇందులో బీమా రంగంలో ఎఫ్‌డిఐను వంద శాతానికి పెంచటం, పెయిడ్-అప్ క్యాపిటల్ తగ్గింపు, కాంపొజిట్ లైసెన్స్‌కు నిబంధన వంటివి ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం, బీమారంగంలో ఎఫ్‌డిఐ పరిమితి 74 శాతంగా ఉన్నది. అయితే, ప్రస్తుత ప్రతిపాదనతో భారతీయ బీమా కంపెనీల్లో ఇది వంద శాతానికి పెరగనున్నది. ఇన్సూరెన్స్ యాక్ట్ 1938, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యాక్ట్ 1956, ది ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్, 1999లకు ప్రతిపాదిత సవరణలపై డిఎఫ్ఎస్ నుంచి ఇది రెండో పబ్లిక్ కన్సల్టేషన్. ప్రస్తుతం, భారత్‌లో 27 జీవిత బీమా కంపెనీలు, 34 నాన్-లైఫ్ లేదా సాధారణ బీమా సంస్థలు ఉన్నాయి. ఇందులో భారత వ్యవసాయ బీమా కంపెనీ, ఇసిజిసి లిమిటెడ్‌లు కూడా ఉన్నాయి.

పింక్‌బాల్ టెస్ట్‌లో టీమిండియా చిత్తు

- 10వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం

అడిలైడ్: పింక్‌బాల్ డే అండ్ నైట్ టెస్ట్‌లో భారతజట్టు పది వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఓవర్‌నైట్ స్కోర్ ఐదు వికెట్ల నష్టానికి 128పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 175 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆస్ట్రేలియా ముందు 18 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగల్గింది. ఆ లక్ష్యాన్ని ఆసీస్ వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా (9), నాథన్ మెక్‌స్వీనీ(10) పరుగులతో రాణించి 3.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. ఆదివారం మూడోరోజు ఆట కొనసాగించిన టీమిండియా 47 పరుగుకే మిగిలిన ఐదు వికెట్లను కోల్పోయింది. రిషబ్ పంత్(28) రూపంలో తొలి దెబ్బ తగిలింది. స్టార్క్ బౌలింగ్‌లో పంత్ ఔటయ్యాడు. ఆ తర్వాత అశ్విన్(7), హర్షిత్ రాణా(0), నితీశ్ రెడ్డి(42), సిరాజ్(7) పరుగులకు ఔటయ్యారు. టీమిండియా తరపున రెండో ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోర్ చేసింది తెలుగు తేజం నితీశ్ కుమార్‌రెడ్డి మాత్రమే. అతను 47 బంతుల్లో 42 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌర్లలో కెప్టెన్ కమిన్స్ ఐదు వికెట్లు తీయగా.. బోలాండ్‌కు మూడు వికెట్లు, స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కిన ట్రావిస్ హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. దీంతో ఐదు టెస్ట్‌ల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఇక మూడో టెస్ట్ డిసెంబర్ 14 నుంచి బ్రిస్బేన్‌లో జరగనుంది.

భళా నితీశ్ కుమార్ రెడ్డి..

రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా గెలిచినా.. టీమిండియా ఇన్నింగ్స్ తేడాతో ఓటమికి గురికాకుండా తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి కీలకపాత్ర పోషించాడు. మూడోరోజు ఆటలో టీమిండియా బ్యాటర్లు ఒక్కొక్కరిగా పెవీలియన్‌కు చేరుతున్నా.. ఆసీస్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొని 'నేనున్నానంటూ' రాణించాడు. మహా మహా సీనియర్లే ఆడలేని పిచ్‌లపై దాటిగా ఆడుతూ జట్టుకు అండగా నిలిచాడు. అరంగేట్ర సిరీసే అయినప్పటికీ.. ఎంతో అనుభవమున్న ఆటగాడిలా ఆడుతూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు, రెండోటెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 42, రెండో ఇన్నింగ్స్‌లో 42పరుగులు చేశాడు. ఈ మూడు ఇన్నింగ్స్‌లోనూ టీమిండియా తరపున అతడితే అత్యధిక స్కోర్. తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జట్టు తక్కువ స్కోరుకే కుప్పకూలే పరిస్థితి వచ్చినప్పుడు ఆరో స్థానంలో వచ్చి చివరి వరకూ నిలిచి జట్టుకు పోరాడే స్కోరును అందించాడు. ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో చూడచక్కటి షాట్లు ఆడుతూ 59 బంతుల్లో 41 పరుగులు చేశాడు. దీంతో భారత్ స్కోరు 150 పరుగులకు చేరగలిగింది. పింక్ బాల్ టెస్టులో పేసర్లకు సహకరించిన పిచ్‌పై బ్యాటర్లు ఇబ్బందిపడిన వేళ.. ఎంతో ఓపికగా ఆడుతూ.. విలువైన ఇన్నింగ్స్(42 పరుగులు) ఆడాడు. ఇక రెండో ఇన్నింగ్స్ సమయంలో భారత్ ఓటమి ఖాయమైనా.. ఇన్నింగ్స్ తేడాతో ఓటమిని తప్పించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆసీస్ పేస్ వ్యూహానికి టాప్ ఆర్డర్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు చేరిన సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన నితీశ్ మరోసారి తనదైన ఇన్నింగ్స్ ఆడాడు. 47 బంతుల్లో 42 పరుగులు చేసి ఆదుకున్నాడు. ఇదే ప్రదర్శనతో రాబోయే టెస్టుల్లో నితీశ్‌కు చోటు పక్కా.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్ : 180ఆలౌట్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 332ఆలౌట్

ఇండియా రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)క్యారీ (బి)బోలండ్ 24, కెఎల్ రాహుల్ (సి)క్యారీ (బి)కమిన్స్ 7, గిల్ (బి)స్టార్క్ 28, కోహ్లి (సి)క్యారీ (బి)బోలండ్ 11, పంత్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 28, రోహిత్ (బి)కమిన్స్ 6, నితీశ్‌కుమార్ రెడ్డి (సి)స్వీనే (బి)కమిన్స్ 42, అశ్విన్ (సి)క్యారీ (బి)కమిన్స్ 7, హర్షిత్ రాణా (సి)ఖవాజా (బి)కమిన్స్ 0, బుమ్రా (నాటౌట్) 2, సిరాజ్ (సి)హెడ్ (బి)బోలండ్ 7, అదనం 13. (36.5ఓవర్లలో ఆలౌట్) 175పరుగులు. **వికెట్ల పతనం:** 1/12, 2/42, 3/66, 4/86, 5/105, 6/128, 7/148, 8/153, 9/166, 10/175 **బౌలింగ్:** స్టార్క్ 14-1-60-2, కమిన్స్ 14-0-57-5, బోలండ్ 8.5-0-51-3.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: స్వీనే(నాటౌట్) 10, ఖవాజా (నాటౌట్) 9. (3.2ఓవర్లలో) 19పరుగులు. **బౌలింగ్:** బుమ్రా 1-0-2-0, సిరాజ్ 1.2-0-9-0, నితీశ్‌కుమార్ 1-0-8-0.

ఆసియా కప్ టైటిల్ బంగ్లాదేశ్ కైవసం

ఫైనల్లో యువ భారత్ బోల్తా

దుబాయ్: ఆసియాకప్ అండర్-19 టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్ చేజిక్కించుకుంది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్ జట్టు 59 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.1 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లు సమిష్టిగా రాణించారు. యుద్ధజిత్ గుహా, చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ తలో రెండేసి, కిరణ్ చోర్‌మలే, కేపీ కార్తికేయ, ఆయుశ్ మాత్రే ఒక్కో వికెట్ తీశారు. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో రిజాన్ హొసేన్(47) టాప్ స్కోరర్‌గా నిలువగా.. మొహమ్మద్ షిహాబ్ జేమ్స్(40), ఫరీద్ హసన్ ఫైసల్(39) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత యువజట్టును అజీజుల్ హకీమ్ తమీమ్ (3/8), ఇక్బాల్ హొసేన్ ఎమోన్ (3/24), అల్ ఫహద్ (2/34), మరూఫ్ మ్రిద (/36), రిజాన్ హొసేన్ (1/14) దెబ్బకు 35.2 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ఇక్బాల్ హసన్‌కు దక్కింది.

జార్జియా, ఎలీసా సెంచరీలు

రెండో వన్డేలోనూ ఆస్ట్రేలియా మహిళల చేతిలో భారత్ చిత్తు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన రెండో వన్డేలో భారత్ 122పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. బ్రిస్బేన్‌లోని అలెన్ బోర్డర్ మైదానంలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను జార్జియా వోల్స్ (101), ఎలీసా పెర్రీ (105) సెంచరీలతో కదం తొక్కారు. ఫోబె లిచ్‌ఫీల్డ్ (60), బెత్ మూనీ (56) అర్ధ శతకాలతో రాణించారు. ఆష్లే గార్డెనర్, సోఫీ డకౌట్ కాగా.. అన్నాబెల్ సదర్లాండ్ 6, అలానా కింగ్ 8, తహ్లియా మెక్‌గ్రాత్ 20లి పరుగులు చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 371 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. భారత బౌలర్లలో సైమా ఠాకూర్ 3, మిన్ను మణి 2.. ప్రియా మిశ్రా, దీప్తి శర్మ, రేణుకా ఠాకూర్ సింగ్ తలో వికెట్ తీశారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇండియా 44.5ఓవర్లలో 249పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ రీచా ఘోష్(54) అర్ధసెంచరీకి తోడు రోడ్రిగ్స్(43), మిన్ను మణి(46), హర్మన్(38) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ఆస్ట్రేలియా బౌలర్లు సథర్లాండ్‌కు నాలుగు, స్కట్, గ్రాత్, గార్డినర్, మోలినెక్స్‌లోకు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో చేజిక్కించుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఎలైసా పెర్రీకి దక్కింది. మూడో, చివరి వన్డే పెర్త్ వేదికగా బుధవారం జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68